E-KABURU

# ఈ-కబురు

17-03-2025 సోమవారం హైదరాబాద్

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



తమన్నా బాయ్ ఫ్రెండ్‌కు అరుదైన వ్యాధి

6 లో

# కేసీఆర్ చిట్టా విప్పుతా

ఆయన కుటుంబం రూ.లక్ష కోట్లు దోచుకుంది

ప్రజలకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి తెలియాలి.. అసెంబ్లీలో వివరిస్తా

ఆదాయం తగ్గినా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం

స్టేషన్ ఘన్‌పూర్ 'ప్రజాపాలన-ప్రగతిబాట' సభలో సీఎం రేవంత్‌రెడ్డి

రూ.630 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి



**ఈ-కబురు, వరంగల్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికిగాను ఆర్టీసీకి ఇప్పటివరకు రూ.5,005 కోట్లు చెల్లించామని, 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. రూ.500కే సిలిండర్‌తో పాటు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. నిరుద్యోగ సమస్యను తరిమికొట్టామన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 'ప్రజాపాలన- ప్రగతిబాట' సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలో రూ.630.27 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. "రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారు. రూ.8.29 లక్షల కోట్ల అప్పును మా నెత్తిమీద పెట్టిపోయారు. ఇందులో రూ.లక్ష కోట్లను ఆయన కుటుంబం దోచుకుంది. గతేడాది రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడితే అంచనాలకు తగ్గ ఆదాయం రాలేదు. అయినా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ప్రజలకు వాస్తవాలు తెలియాలి. ఎమ్మెల్యేగా 15 నెలలుగా జీతభత్యాలు తీసుకుంటున్న వ్యక్తి బాధ్యత తీసుకోవడం లేదు. ఇది ఇంటర్‌వెల్ మాత్రమే. అసెంబ్లీలో ఈ నెల 19, 20 తేదీల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర వివరాలు వెల్లడిస్తాను. కేసీఆర్ చిట్టా విప్పుతాను. పదేళ్లలో కేసీఆర్ సర్కారు చేతికి రూ.10.80 లక్షల కోట్లు వచ్చాయి. వాటితో ఏం చేశారు? రూ.లక్ష కోట్ల వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారు.. కూల్చారు. అది కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం. కాంగ్రెస్ హయాంలో కట్టిన నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరామసాగర్, దేవాదుల, ఇందిరా, రాజీవ్ సాగర్‌లు తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్నాయి. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం వడ్డీ లేని రుణాలిస్తోంది. సోలార్ ప్లాంట్లు, బస్సుల నిర్వహణను అప్పగిస్తోంది. పాత్రికేయులకు భారాస ప్రభుత్వం పదేళ్లలో ఇవ్వలేని

మిగతా 2లో

# రెండోసారి అధికారం మీ కలే

మీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

భాషను కలుషితం చేసిందే మీరు

సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు మండిపాటు



**ఈ-కబురు, హైదరాబాద్:** "రెండోసారి అధికారంలోకి వస్తాం.. మళ్లీ నేనే సీఎం అని చెబుతున్నారు. అది మీ కలే..! మీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. మీ పాలనకు పతనం ప్రారంభమైంది" అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. "మీరు భాష గురించి మాట్లాడారు. అసెంబ్లీలో బూతులపై నీతులు చెప్పే ప్రయత్నం చేశారు. మీకు మాత్రమే భార్యాబిడ్డలుంటారా? ఎదుటివారికి ఉండరా? మీవరకూ వస్తే గానీ కుటుంబం గుర్తుకురాదా? గతంలో కేసీఆర్‌ను ఉద్దేశించి కాల్చిపడేయాలని మాట్లాడారు మీరు.. ప్రగతిభవన్‌ను పేల్చేయాలన్నారు.. కేటీఆర్ కుమారుడిపై వ్యాఖ్యానాలు చేశారు.. నాఎత్తు గురించి అడ్డగోలుగా వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో భాషను కలుషితం చేసిందే మీరు. నిన్న మీరు మాట్లాడింది చూస్తే.. మోదీని ప్రసన్నం చేసుకునేలా ఉంది. కాంగ్రెస్ ముసుగులో ఉన్న భాజపా మనిషి మీరు. మోదీని రాహుల్‌గాంధీ విమర్శిస్తుంటుంటే.. మీరేమో పొగడ్తలతో ముంచెత్తుతున్నారు" అని విమర్శించారు. శనివారం అసెంబ్లీ, మండలిలో సీఎం రేవంత్ చేసిన ప్రసంగాల్లోని పలు అంశాలపై ఆదివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు రెండు గంటలకు పైగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**అలవోకగా అబద్ధాలు**

"అసెంబ్లీలో మీరు అబద్ధాలను అలవోకగా ఎలా మాట్లాడొచ్చో చూపించారు. ఆ అబద్ధాలకు జీఎస్టీ వేస్తే ప్రభుత్వ ఖజానా మొత్తం పోతుంది. అందాల పోటీలు కాదు.. హైదరాబాద్‌లో తిట్ల పోటీలు పెట్టాలి. ఉద్యోగాల విషయంలో మీరు అబద్ధమాడుతున్నారని

మిగతా 2లో



## పాక్‌తో శాంతికి యత్నిస్తే ద్రోహం ఎదురైంది

ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన పాడ్‌కాస్ట్ ముఖాముఖిలో ప్రధాని మోదీ

2 లో



## సీఎం రేసు నుంచి ఏక్‌నాథ్ శిందే వైదొలుగుతున్నారా?

2 లో

## అప్పులు.. అవినీతిలో కేసీఆర్‌తో రేవంత్ పోటీ

డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, డీఎంకేలది దివాలాకోరుతనం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



**ఈ-కబురు, హైదరాబాద్:** అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.52 లక్షల కోట్లు అప్పు చేసిందని.. అప్పులు, అవినీతితో పాటు అన్ని విషయాల్లో కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి పోటీ పడుతున్నారని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో

మిగతా 2లో



## అప్రమత్తతే.. శ్రీవారి రక్ష!

సాంకేతికత సాయంతో భక్తుల దోపిడీ

మధ్యవర్తులను ఆశ్రయించవద్దని తితిదే సూచన

2 లో

## నేడు శాసనసభలో రెండు చరిత్రాత్మక బిల్లులు

ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42% రిజర్వేషన్లు..

సామాజిక న్యాయాన్ని కాంక్షిస్తూ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

2 లో



# హైదరాబాద్ హలీంకు సలాం

**ఈ-కబురు, హైదరాబాద్:** హైదరాబాద్ కు హలీంకు విడదీయరాని సంబంధం ఉంది. ముఖ్యంగా రంజాన్ మాసంలో ఎక్కడ చూసిన హలీం వాసల ఘుమఘు మలా డుతుంది. హలీం లేకుండా రంజాన్ ను ఊహించుకో లేరంటే, దానికి ఉన్న క్రేజ్ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. అద్భుతమైన హలీం అందించడం లో హైదరాబాద్ లోని పాపులర్ హెూటళ్లు పోటీ పడుతాయి. టేస్ట్‌లో రాజీ లేకుండా అందించడంలో ముందుంటున్నాయి. హైదరాబాద్ లో మైమరచిపోయే హలీం తినాలని మీరూ భావిస్తున్నారా? అయితే, ఆహా అనిపించే హలీం దొరికే బెస్ట్ ప్లేసెస్ గురించి ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

**పిస్తా హౌస్**

హైదరాబాద్ లో హలీం అనగానే ముందుగా గుర్తుకు వచ్చే పేరు పిస్తా హౌస్. గత 25 ఏండ్లుగా ఈ రెస్టారెంట్ తమ కస్టమర్లకు రుచికరమైన హలీం అందిస్తోంది. పిస్తా హౌస్ హలీం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు హలీం, బిర్యానీ, కబాబ్ లు, షవర్మాలు అందిస్తోంది. హైదరాబాద్ లో ఉన్న వాళ్లు కచ్చితంగా ఒక్కసారైనా పిస్తా హౌస్ హలీం టేస్ట్ చేయాల్సిందే! ఇక్కడ మధ్యాహ్నం 12 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు హలీం లభిస్తుంది.

**సలీం కి హలీం**

హలీం అభిమానులను ఆకట్టుకనే మరో ప్రదేశం సలీం కి హలీం రెస్టారెంట్. హైదరాబాద్ లోని హలీం ప్రియులు

మిగతా 2లో



# కేసీఆర్ చిట్టా విప్పుతా

మొదటి పేజి తరువాయి

ప్లాట్లు ఇచ్చాం. గ్రూప్-1, 2, 3 పరీక్షలను సజావుగా నిర్వహించి ఉద్యోగాలిస్తున్నాం.

**రాష్ట్రానికే స్టేషన్‌ఘన్‌పూర్ ఆదర్శంగా నిలవాలి**

కడియం శ్రీహరితో 25 ఏళ్ల అనుబంధం ఉంది. నేను కోరడంతోనే ఆయన కాంగ్రెస్‌లో చేరారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఆయన ఒత్తిడి తెచ్చి రూ.800 కోట్లు మంజూరు చేయించుకున్నారు. అభివృద్ధిలో నియోజకవర్గం ఉమ్మడి వరంగల్ జిల్లాకే కాకుండా రాష్ట్రానికే ఆదర్శంగా ఉండాలి. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మామునూరు ఎయిర్‌పోర్టును తీసుకొస్తానని మాటిచ్చాను. చెప్పినట్టుగానే సాధించాను. మా ప్రభుత్వం వచ్చిన తర్వాతే వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ, ఓఆర్‌ఆర్, భూగర్భ డ్రైనేజీ, కాళోజీ కళాక్షేత్రం రూపుదాల్చాయి. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌ను రూ.6,500 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం.

**కొండా లక్ష్మణ్, జయశంకర్‌లు జాతిపితలు**

త్యాగాలు చేసినవారు రాష్ట్ర, జాతిపితలు అవుతారు తప్ప నిత్యం అబద్ధాలు చెప్పేవారు, దోచుకునేవారు కాదు. రాష్ట్రానికి అసలైన జాతిపితలు కొండా లక్ష్మణ్ బాపూజీ, జయశంకర్‌లు. ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించాలని నాకు అధికారం అప్పగిస్తే 10 నెలలకే కొందరు దిగిపొమ్మంటున్నారు. ఈ కుర్చీలో కూర్చుని దోచుకోవాలని వారనుకుంటున్నారు" అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

**మహిళా సమాఖ్యలకు బస్సులు**

అంతకుముందు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి



హెలికాప్టర్‌లో స్టేషన్ ఘన్‌పూర్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం సభా ప్రాంగణంలో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాళ్లను సీఎం సందర్శించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు రూ.2.10 కోట్లతో మంజూరు చేసిన ఏడు బస్సులను ప్రారంభించి.. మహిళా సమాఖ్యలకు అందజేశారు. ఎంపీలు కడియం కావ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఆయిల్‌సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, జనగామ, హనుమకొండ కలెక్టర్లు షేక్ రిజ్వాన్ బాషా, ప్రావిణ్య, వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను కేసీఆర్ కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసింది. తెలంగాణ ఏర్పడినప్పుడు అప్పులకు నెలకు రూ.500 కోట్లు చెల్లిస్తే.. ఇప్పుడు రూ.6,500 కోట్లు చెల్లిస్తున్నాం. ఒక్క ఏడాదిలోనే అసలు, వడ్డీ కింద కట్టిన మొత్తం రూ.1.53 లక్షల కోట్లు. ఆ సొమ్ము నా చేతిలో ఉంటే రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను కట్టించేవాడిని. 75 లక్షల మంది రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేసేవాడిని.

**ఎక్కడైనా చర్చకు సిద్ధం**

ఏడాది కాలంలో ఏం చేశామో చెప్పడానికి మేం సిద్ధం. హరీశ్‌రావు, కేటీఆర్‌లు కాదు.. అసలాయన(కేసీఆర్) వస్తే భీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, రాజోలిబండ, మంజీర.. ఎక్కడైనా చర్చకు సిద్ధం. అపార అనుభవం ఉన్న వ్యక్తి దాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగించాలి కదా! బయటకు రాకుంటే ప్రతిపక్ష నేత హోదా ఎందుకు? రూ.లక్ష కోట్లు సంపాదించిన ఆయన తన ఆస్తులు ఎలా పెరిగాయో నిరుద్యోగులకు చెప్పాలి. అవసరమైతే వెయ్యి మంది చొప్పున వారిని ఫాంహౌస్‌కే పంపిస్తాను.

**దోచుకున్న సొమ్ముతో ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకుంటున్నారు**

పదేళ్ల పాలనలో దోచుకున్న రూ.లక్ష కోట్లతో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలగొట్టాలని చూస్తున్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరుతున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారు. నిజాలు బయటపడతాయనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. గోదావరి పరీవాహకంలో పంటలు ఎండిపోవడానికి కారణం గత పాలకులే. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇవ్వడంలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 16 గంటలు శ్రమిస్తూ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ప్రజల అండదండలు ఉన్నంతకాలం ప్రభుత్వానికి ఢోకా లేదు.

**ఆర్థిక అవస్థలున్నా.. అభివృద్ధి కొనసాగిస్తాం**

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిని కొనసాగిస్తున్నాం. ఉమ్మడి వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిలా అభివృద్ధి చేయడం సంతోషం. గత ప్రభుత్వ హయాంలో స్టేషన్ ఘన్‌పూర్‌తో పాటు వరంగల్ జిల్లాలోని ఇతర నియోజకవర్గాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ ప్రాంతానికి తన సొంత ప్రాంతం కంటే ఎక్కువ నిధులు కేటాయిస్తున్నారు. వరంగల్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సీఎంను కోరుతున్నా.

**కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి, సంక్షేమం**

చెప్పింది చేయడం.. చేయగలిగేదే చెప్పడం సీఎం రేవంత్‌రెడ్డి నైజం. కాంగ్రెస్ అంటేనే సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉపాధి, ఉద్యోగాల కల్పన. భారాస అంటే మహిళలను, అట్టడుగువర్గాలను అణచివేయడం.. అహంకారాన్ని ప్రదర్శించడం. పది నెలల్లోనే మా ప్రభుత్వం 57 వేల కొలువులు ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధం చేసిన ఘనత ముఖ్యమంత్రిదే. బీసీ రిజర్వేషన్ల పెంపుపై త్వరలోనే చట్టం చేయబోతున్నాం. మహిళా సంఘాలకు రూ.21,600 కోట్ల వడ్డీలేని రుణాలిచ్చి.. రూ.92 కోట్ల వడ్డీ విడుదల చేసి సీఎం పెద్దన్నగా నిలిచారు.

# పాక్‌తో శాంతికి యత్నిస్తే ద్రోహం ఎదురైంది

**ఈ-కబురు, దిల్లీ:** పాకిస్థాన్‌తో శాంతి కోసం చేసిన ప్రతి ప్రయత్నానికి ద్రోహం, శత్రుత్వం ఎదురయ్యాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునే బాధ్యత ఇస్లామాబాద్ నాయకత్వంపైనే ఉందన్నారు. రెండు దేశాలు కొత్త ప్రయాణం ప్రారంభించాలనే ఉద్దేశంతో 2014లో తన ప్రమాణస్వీకార కార్యక్రమానికి అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించినట్టు తెలిపారు. ప్రస్తుతం పొరుగుదేశ ప్రజలు కూడా శాంతిని కోరుకుంటున్నారని తాను భావిస్తున్నానన్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల మెరుగుకు గతంలో సార్క్ దేశాధినేతలను ఆహ్వానించానని, ఈ పరిణామం శాంతి, సామరస్యం పట్ల మనదేశానికి గల నిబద్ధతను చాటిందని, అయితే ఆశించిన ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అమెరికాకు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) పరిశోధకుడు లెక్స్ ఫ్రిడ్‌మాన్‌కు ఇచ్చిన పాడ్‌కాస్ట్ ముఖాముఖిలో ప్రధాని మోదీ వెల్లడించారు.

**దృఢసంకల్పం గల నేత ట్రంప్**

"అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పరస్పర విశ్వాసం అనే బంధాన్ని పంచుకున్నాను. ఎందుకంటే జాతి ప్రయోజనాలే సర్వోన్నతమని మేమిద్దరం భావిస్తాం. రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ మదిలో అమెరికా అభివృద్ధిపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఉంది. హుషారైన, దృఢసంకల్పం గల ట్రంప్‌పై కాల్పులు జరిగిన సమయంలోనూ వాటిని నేను ఆయనలో చూశాను.

**భారత్-చైనా మధ్య ఆరోగ్యకర పోటీ ఉండాలి**

భారత్-చైనాల మధ్య వైరుధ్యాల పరిష్కారానికి చర్చలకే మొగ్గు చూపుతా. వాస్తవాధీన రేఖ వెంట 2020 ముందునాటి పరిస్థితులను నెలకొల్పేందుకు రెండు దేశాలు కృషి చేస్తున్నాయి. ఇరు దేశాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కోరుకుంటున్నాం. అది ఘర్షణకు దారి తీయరాదు.

**చర్చలతోనే రష్యా-ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం**

రష్యా-ఉక్రెయిన్ మధ్య చర్చలు సాధ్యమైనప్పుడే వాటి మధ్య గల వివాదానికి పరిష్కారం లభిస్తుంది. యుద్ధక్షేత్రంలో ఎన్నటికీ పరిష్కారం దొరకదు. ఈ వ్యవహారంలో భారత్ తటస్థంగా లేదు. అయితే శాంతికి దృఢంగా కట్టుబడి ఉంది. రష్యా



అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధినేత వొలోదిమిర్ జెలెన్‌స్కీలతో నాకు సత్సంబంధాలున్నాయి" అని మోదీ అన్నారు.

**వివేకానందుడి మాటలే సంఘ్‌లో నేర్పుతారు**

విమర్శ అనేది ప్రజాస్వామ్యానికి ఆత్మవంటిది. నేను విమర్శలను స్వాగతిస్తా. అవి మరింత పదునుగా ఉండాలి. నా శక్తి పేరులో లేదు. 140 కోట్ల మంది భారతీయుల మద్దతు, దేశ సంస్కృతి, వారసత్వంలోనే ఉంది. దేశమే ప్రధానమని ఆరెస్సెస్ బోధిస్తుంది. మానవ సేవే మాధవ సేవ. ఆ గొప్ప సంస్థ నుంచి ఎన్నో విలువలను నేర్చుకున్నా. సంఘ్(ఆరెస్సెస్) చాలా పెద్ద వ్యవస్థ. వేదాలు, స్వామి వివేకానందుడు చెప్పిన మాటలనే సంఘ్ సభ్యులకు నేర్పిస్తుంటారు.

**బూట్ల మెరుపు కోసం సుద్ద ముక్కలు**

నా బాల్యం మొత్తం పేదరికంలోనే గడిచింది. నా తెల్ల బూట్లను మెరిపించేందుకు పాఠశాలలో వాడి పడేసిన సుద్ద ముక్కలను సేకరించి తెచ్చుకునేవాడిని. ఓ గొప్ప సత్కార్యం కోసం ఉన్నత శక్తి నన్ను ఇక్కడకు పంపించింది.

# హైదరాబాద్ హలీంకు సలాం

మొదటి పేజి తరువాయి

ఇక్కడ తినేందుకు ఎంతగానో ఇష్టపడుతారు. తక్కువ ధరలో బెస్ట్ క్వాలిటీ హలీం అందిస్తారు. నగరం నడిబొడ్డున ఉన్న సలీం కి హలీం రెస్టారెంట్ ముందు రంజాన్ సందర్భంగా సాయంత్రం అయితే పొడవైన క్యూలు కనిపిస్తాయి. ఇక్కడ ఉదయం 11.30 నుంచి రాత్రి 12.30 గంటల వరకు హలీం లభిస్తుంది.

**పెషావర్ రెస్టారెంట్**

హైదరాబాద్‌లోని పెషావర్ రెస్టారెంట్ అద్భుతమైన హలీంను అందిస్తుంది. ఇక్కడ ఎంతో ఉత్సాహభరితమైన వాతావరణం ఉంటుంది. ఇక్కడి మటన్ ఫుడ్స్, హలీమ్, తందూరీ చికె, కబాబ్‌లు నోరూరిస్తాయి. ప్యూర్ మటన్, గోధుమ, బార్లీ, కాయధాన్యాలు, భారతీయ సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన హలీం తింటే ఆహా అనాల్సిందే. ఇక్కడ మధ్యాహ్నాం 12 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంటల వరకు హలీం దొరుకుతుంది.

**సర్వి**

1998 ఈ రెస్టారెంట్ ప్రజలకు రుచికరమైన ఫుడ్స్ అందిస్తోంది. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ లో ఉన్న ఈ రెస్టారెంట్ మొఘలాయి, ఇరానియన్ వంటకాలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ హలీం ఇప్పుడు బాగా పాపులర్ అయ్యింది. ఇక్కడ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు హలీం లభిస్తుంది.

**మందార్**

ఇండియన్, చైనీస్, మొఘలాయి, అరబిక్



వంటకాలకు బాగా పాపులర్. మటన్ మండి, చికెన్ మండి, హలీమ్, కబాబ్‌లు ఎంతో రుచికరంగా ఉంటాయి. రంజాన్ సందర్భంగా ఇక్కడ హలీం తినేందుకు జనాలు ఎగబడుతారు. ఇక్కడ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఇక్కడ హలీం లభిస్తుంది.

**షా ఘౌస్**

దీనిని 1984లో దీనిని స్థాపించారు. ఇక్కడ బిర్యానీ, కబాబ్‌లు, హలీమ్ చాలా ఫేమస్. హైదరాబాదీ హలీమ్, హైదరాబాదీ బిర్యానీ తినేందుకు ఇక్కడికి పెద్ద సంఖ్యలో జనాలు తరలి వస్తారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 1 గంట వరకు ఇక్కడ హలీం లభిస్తుంది.

**షాదాబ్ హొటల్**

ఇంట్లో తయారు చేసిన ఫుడ్స్ లాగే ఇక్కడి ఫుడ్స్ ఉంటాయి. ఇదొక సాధారణ రెస్టారెంట్ అయినా, ఇక్కడి హలీంకు సలాం చేయాల్సిందే. మొఘలాయి పద్ధతిలో తయారు చేసే హలీం ఎంతో రుచికరంగా ఉంటుంది. ఇక్కడ ఉదయం 5 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు హలీం లభిస్తుంది.

**గ్రిల్ 9**

గ్రిల్ 9 హైదరాబాద్ లో ఫేమస్ రెస్టారెంట్. మొఘలాయి రుచులు, రంజాన్ హలీంకు చాలా ప్రసిద్ధి. కబాబ్‌లు, స్మోకీ టిక్కాలకు ఆహా అనిపిస్తాయి. మాంసం, గోధుమలు, నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన హలీం రుచి ఆహా అనిపిస్తుంది. ఇక్కడ మధ్యాహ్నాం 12 గంటల నుంచి రాత్రి 11.45 వరకు హలీం లభిస్తుంది.

**మెహ్ఫిల్**

2006 నుంచి ఇక్కడ రుచికరమైన హలీం అందిస్తున్నారు. ఐకానిక్ బిర్యానీ, సుగంధ కబాబ్‌లు, హలీమ్ తో పాటు నార్త్ ఫుడ్స్ ఇక్కడ లభిస్తాయి. రంజాన్ మాసంలో హలీం బాగా ఫేమస్. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఇక్కడ హలీం లభిస్తుంది.

**ప్యారడైజ్**

బిర్యానీ సామ్రాజ్యానికి ప్రసిద్ధి చెందిన ప్యారడైజ్.. హలీం సీజన్ లో రుచికరమైన హలీం అందిస్తున్నది. హైదరాబాద్ లో బోలెడు ప్యారడైజ్ అవుట్ లెట్లలో ఎక్కడైనా తీసుకునే అవకాశం ఉంది. మెయిన్బ్రాంచ్ మాత్రం సికింద్రాబాద్ ప్యారడైజ్ లో ఉంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఇక్కడ హలీం లభిస్తుంది.

**కేఫ్ బహార్**

కేఫ్ బహార్ లో ఆహా అనిపించే బిర్యానీ లభిస్తుంది. రంజాన్ మాసంలో అద్భుతమైన హలీం లభిస్తుంది. ఇక్కడ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 12.30 వరకు హలీం లభిస్తుంది.

## మొదటి పేజి తరువాయి

### రెండోసారి అధికారం మీ కలే

నిరుద్యోగులకు అర్థమైంది. కాబట్టే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నియామక నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు పెట్టి, ఫలితాలు వెల్లడిస్తే.. మీరొచ్చి నియామక పత్రాలిచ్చారు. ఎన్నికలకు ముందు ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేస్తామని చెప్పి.. ఇప్పుడు డబ్బు వసూలు చేస్తున్నారు. ఫార్మాసిటీ భూములను వెనక్కి ఇస్తామన్న కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు ఫోర్త్‌సిటీ పేరిట వాటి విలువ పెంచుతూ స్థిరాస్తి వ్యాపారం చేయాలనుకుంటున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. 15 నెలలు గడుస్తున్నా ఎందుకు చేయలేదు?

**ప్రాజెక్టులు కట్టకుండా అన్యాయం చేసిందే మీరు?**

మహబూబ్‌నగర్‌కు కేసీఆర్ అన్యాయం చేశారని మీరు ఆరోపిస్తున్నారు. ఆయన దార్శనికుడు కాబట్టే.. కృష్ణా జలాల్లో హక్కుగా రావాల్సిన నీటికోసం సెక్షన్-3ని రాబట్టారు. తద్వారా ఇప్పుడు నదిలో 70 శాతం నీటివాటా తెలంగాణకు రావడానికి మార్గం సుగమమైంది. కాంగ్రెస్, తెదేపా పాలకులు తెలంగాణలో ప్రాజెక్టులు కట్టకపోవడం వల్లే.. కృష్ణాలో తగిన కేటాయింపులు లేవు. ఈ ద్రోహానికి కారణం మీరే కదా? పులిచింతల, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులను వ్యతిరేకించి ఉమ్మడి రాష్ట్రంలో పదవులను విసిరేసి వచ్చింది మేము. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుపై 40 రోజులు అసెంబ్లీని స్తంభింపజేసింది అప్పటి తెరాస పార్టీ. పాలమూరు కరవు, వలసలకు కారణమే కాంగ్రెస్, తెదేపాలు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు రూ.4వేల కోట్లు ఖర్చుపెట్టి.. 10 లక్షల ఎకరాలకు నీరందించిన ఘనత భారాసది. కృష్ణా నీటిని ఏపీ తరలించుకుపోతుంటే.. కాంగ్రెస్ సర్కారు చేతులు కట్టుకొని చూస్తోంది. కృష్ణానదిలో ఈ ఏడాది 24 శాతం వాటా జలాలను వాడుకోవడం చేతకాని ప్రభుత్వం. గోదావరిలో నీళ్లు ప్రవహించినప్పుడు 33 రోజులు మోటార్లు ఆన్ చేయకపోవడం వల్లే ఇప్పుడు పంటలు ఎండిపోయాయి.

### అప్పులు.. అవినీతిలో కేసీఆర్‌తో రేవంత్ పోటీ

ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోంది. తాజాగా ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు చేయొద్దని ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో భారాస ఇదే తీరుగా వ్యవహరించింది. కేసీఆర్‌కు మీకు తేడా ఏంటో చెప్పాలి. ఇసుక వ్యాపారం, లిక్కర్ దోపిడీ, బెల్టుషాపులు, అక్రమ భూముల వ్యాపారంలో మార్పు వచ్చిందా? చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఎప్పుడు దిగిపోతారా అని ప్రజలు చూస్తుంటే మరోమారు తాను ముఖ్యమంత్రిని అవుతానని చెబుతున్నారు. ఎవరు వస్తారో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**అఖిలపక్షంలో తప్పుడు ప్రచారం చేయొద్దు**

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఏర్పాటుచేస్తున్న అఖిలపక్ష సమావేశంపై కిషన్‌రెడ్డి మరోమారు స్పందించారు. 'అఖిలపక్షం పెట్టుకోండి. మాకు ఏ అభ్యంతరం లేదు. కానీ మంచి సలహాలు ఇవ్వండి. తప్పుడు ప్రచారం చేయకండి. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాష విధానం, జాతీయ విద్యా విధానం అంశాలపై డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్న వైఖరి దివాలాకోరుతనంతో కూడింది.

### నేడు శాసనసభలో రెండు చరిత్రాత్మక బిల్లులు

**ఈ-కబురు, హైదరాబాద్:** రాష్ట్రంలో సామాజిక వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రెండు చరిత్రాత్మక బిల్లులను ప్రభుత్వం సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంతోపాటు సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించనుంది. వీటికి ఇప్పటికే మంత్రివర్గం ఆమోదం తెలపడంతో బిల్లులకు శాసనసభ ఆమోదం తీసుకోనుంది. ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల పెంపుపై శాసనసభ, మండలిలో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక చర్చ జరగనుంది. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం సామాజిక, ఆర్థిక కుల సర్వే నిర్వహించింది. ఈ నివేదిక ప్రకారం బీసీలతోపాటు కులాలవారీగా జనాభా లెక్కలు వెల్లడయ్యాయి. బీసీల జనాభా ప్రకారం సామాజిక న్యాయం కల్పించేందుకు వారి రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 29% అమలవుతున్నాయి. ఇందులో బీసీలకు 25%, ముస్లింలకు బీసీ-ఈ కింద 4% ఉంది. 42 శాతానికి పెంచేందుకు బిల్లును ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో బీసీ ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం అసెంబ్లీ హాల్‌లో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

### అప్రమత్తతే.. శ్రీవారి రక్ష!

**ఈ-కబురు, తిరుమల:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు తరలి వచ్చే పలువురు భక్తులు దళారుల చేతుల్లో మోసపోతున్నారు. తిరుమలకు నిత్యం 40 వేల నుంచి లక్ష మంది భక్తులు వస్తారు. రద్దీని అవకాశంగా మలుచుకుంటున్న కేటుగాళ్లు సాంకేతికత, పరిచయాల ద్వారా, తితిదే ఉద్యోగుల పేరుతో, అనధికార పీఆర్వోలుగా చెలామణి అవుతూ అందినకాడికి దోచేస్తున్నారు. ఇదే కోవలో తితిదే వెబ్‌సైట్‌ను పోలిన నకిలీ వెబ్‌సైట్లు ఇంటర్నెట్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. వాటిలో టికెట్ బుక్ చేసుకుంటే నగదు పోయినట్లే. ఇంకొందరు ఘరానా మోసగాళు తితిదేను సంప్రదించే భక్తుల వివరాలను తెలుసుకొని.. వారిని ట్రాప్ చేస్తున్నారు. తమను తాము తితిదే సిబ్బందిగా పరిచయం చేసుకొని దర్శనం చేయిస్తామంటూ డబ్బు వసూలు చేస్తున్నారు. తిరుమల టూటౌన్ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసిన బోయ పవన్‌కల్యాణ్ చేసిన మోసమే అందుకు నిదర్శనం. తాము తితిదే ఛైర్మన్ పీఆర్వోనని, జేఈవో కార్యాలయంలో పని చేస్తున్నానని, తితిదే ఉద్యోగినని సదరు అధికారుల ఫొటోలు తమ వాట్సప్ డీపీలుగా పెట్టుకుని నమ్మిస్తున్నారు.

### సీఎం రేసు నుంచి ఏక్‌నాథ్ శిందే వైదొలుగుతున్నారా?

**ఈ-కబురు, ముంబయి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమి.. ముఖ్యమంత్రి అభ్యర్థిని మాత్రం ఇంకా తేల్చలేకపోతోంది. భాజపా నుంచే ముఖ్యమంత్రి అభ్యర్థి ఉండాలని ఆ పార్టీ అధిష్ఠానం అంటుండగా.. 'బిహార్ ఫార్ములా' ప్రకారం.. ఏక్‌నాథ్ శిందేను కొనసాగించాలని శివసేన పట్టుబడుతోంది. దీనిపై సందిగ్ధం నెలకొన్న వేళ ప్రస్తుత ముఖ్యమంత్రి శిందే పెట్టిన ఓ పోస్ట్ సంచలనంగా మారింది. దీంతో సీఎం రేసు నుంచి ఆయన వైదొలుగుతున్నట్లు ఊహాగానాలు ఊపందుకున్నాయి.

## అతివకు నైపుణ్యం.. ఆలోచనలకు అంకురం

నైపుణ్య లేమితో మహిళలు వ్యాపారాభివృద్ధిలో సవాళ్లు ఎదుర్కొంటున్నారు. కెరీర్ గైడెన్స్ లేక యువత నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో మహిళా సాధికారతే లక్ష్యంగా అంకుర(స్టార్టప్) పరిశ్రమలు ఏర్పాటు చేయించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 'వీ-హబ్' అండగా నిలుస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో పెద్దపల్లిలో శిక్షణ కేంద్రం ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

వ్యాపార రంగంలో అతివలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా నైపుణ్యం పెంచడం, ఆర్థిక సాధికారతే లక్ష్యంగా గత ప్రభుత్వం 2018లో 'వీ-హబ్(వుమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్)'ను ఏర్పాటు చేసింది. డిగ్రీ, పీజీ విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వడం, అంకుర పరిశ్రమలు ఏర్పాటు చేయించడం, స్వశక్తి సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తోంది. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

**ఉత్పత్తులకు ఊతం**

ఆహారశుద్ధి, వస్త్ర తదితర రంగాల్లో వ్యాపార మెలకువలు నేర్పిస్తారు. ఉత్పత్తులతో పాటు మార్కెటింగ్ వసతులపై క్షేత్ర సందర్శనలతో అవగాహన కల్పిస్తారు. అంకుర పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ పథకాలను అనుసంధానిస్తూ బ్యాంకర్లను సమన్వయం చేస్తారు. పోటీ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తారు. ఉత్పత్తులకు హక్కులు, మార్కెటింగ్ వసతులు కల్పిస్తారు. పెద్దపల్లిలో కేంద్రంఉమ్మడి జిల్లాలో మొదట పెద్దపల్లిలో 'వుమెన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. చేనేత, అద్దకం, ప్రింటింగ్, ఆహారశుద్ధి, గార్మెంట్స్ తదితర రంగాల్లో నైపుణ్య శిక్షణ, కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తారు. డిగ్రీ, పీజీ విద్యార్థినులకు డిజిటల్ మార్కెటింగ్, ఎంఎస్ వర్డ్, ఎక్సెల్, వెబ్ డిజైన్, మార్కెటింగ్, ఎకౌంటెన్సీ బేసిక్(సీసీఏ), డిప్లొమా ఇన్ ఇన్‌ఫర్మేషన్ ప్రాసెసింగ్, సినిమాటోగ్రఫీలో శిక్షణ ఇస్తారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందిస్తారు. ఆయా కోర్సుల్లో ఉమ్మడి జిల్లా మహిళలకు శిక్షణ ఇవ్వనున్నారు.

## నోటీసులు ఇచ్చినా స్పందించరా?

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో ఆలోపు ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేసుకునేలా నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ రంగంలోకి దిగారు. ఆదివారం పలు డివిజన్లలో ఆస్తిపన్ను వసూలును స్వయంగా చేపట్టారు. కొన్ని ఇళ్లలలో నల్లా కనెక్షన్లు తొలగించారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. రాంనగర్‌లో ఓ ప్రైవేటు పార్కుకు, తిలక్‌రోడ్డులో కమర్షియల్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు తాళం వేశామన్నారు. బడా బకాయిదారుల పేర్లను డివిజన్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, ఇన్‌ఛార్జి ఆర్వో కలీముల్లాఖాన్, పాల్గొన్నారు.

## సాగులో స్ఫూర్తి.. పురస్కార కీర్తి

కృషి విజ్ఞాన కేంద్రాల తోడ్పాటు, శాస్త్రవేత్తల సూచనలతో పలువురు రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రైతులు శాస్త్రవేత్తలు అందించిన మినీ కిట్లను సాగు చేసి ఉత్తమ ఫలితాలు సాధించారు. పరిశోధనాత్మక పరిశీలన, ఆచరణాత్మక విధానాలతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న రైతుల్లో పెద్దపల్లి మండలం కాసులపల్లికి చెందిన ఎర్రం మల్లారెడ్డి ఒకరు. ఇటీవల ఆయన జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నారు.

**రెండు దశాబ్దాలుగా డ్రమ్‌సీడర్ విధానం**

శాస్త్ర పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, మేలైన వంగడాలను రైతులకు అందించడంతో పాటు పంటల ఉత్పత్తిలో వస్తున్న మార్పులు, అందుకు అనుగుణంగా ఆధునిక విధానాలను అనుసరించడం, తోటి రైతులకు అవగాహన కల్పించడంలో మల్లారెడ్డి ముందువరుసలో ఉంటారు. వరి సాగులో ఖర్చులను నియంత్రించేందుకు ఆయన ఇరవై ఏళ్లుగా డ్రమ్ సీడర్ విధానంలో విత్తుతున్నారు. ప్రస్తుతం కాసులపల్లిలో 90 శాతం మంది రైతులు ఈ పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నారు. అలాగే రాష్ట్రంలోని వివిధ పరిశోధన సంస్థల నుంచి శాస్త్రవేత్తలు ఇచ్చిన విత్తనాలను సాగుచేసి, అందులో తెగుళ్లను తట్టుకొని అధిక దిగుబడులను ఇచ్చే రకాలను ఎంపిక చేస్తున్నారు. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులకు కూడా మల్లారెడ్డి పండించిన విత్తనాలను అందించారు. ఏటా 10 రకాల వరి విత్తనాలు సాగు చేస్తున్న ప్రస్తుత సీజన్‌లో 5 రకాలు వేశారు. మల్లారెడ్డి ప్రతిభను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ పరిశోధన సంస్థలు పలు పురస్కారాలు అందజేశాయి. గత ఫిబ్రవరిలో భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో దిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు బెస్ట్ ఇన్నోవేటివ్ ఫార్మర్-2025 పురస్కారాన్ని అందజేశారు. ఇప్పటివరకు పదికి పైగా పురస్కారాలు అందుకున్న మల్లారెడ్డి.. శాస్త్రవేత్తల సహకారంతోనే తాను ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు.

## పల్లెల గొంతెండుతోంది

మంథనిలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరందక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. తగినంత సరఫరా కాకపోవడంతో గ్రామాల్లో బోర్లకు మోటార్లు బిగించుకొని నీటిని వినియోగించుకుంటున్నారు. మండలంలోని మైదుపల్లి, ఉప్పట్ల, వెంకటాపూర్, అడవిపోమన్‌పల్లి గ్రామాలకు భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో బోర్లకు మోటార్లు బిగించుకొని నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే మంథని, ఎగ్లాస్‌పూర్, సూరయ్యపల్లి, గుంజపడుగు గ్రామాల్లో నీటిని అదనంగా వినియోగిస్తున్నట్లు తెలిసింది.

**మానేరు నుంచి పైపులైను..**

మంథనిలోని మైదుపల్లిలో నాలుగు బోర్లకు మోటార్లు బిగించుకున్నారు. 4వ వార్డులో మోటారు చెడిపోయి రెండు నెలలవుతున్నా.. మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. ఉప్పట్లలో మూడు బోర్లకు మోటార్లు బిగించుకున్నారు. వెంకటాపూర్‌లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో మానేరునుంచి పైపులైన్ ద్వారా ట్యాంకులోకి ఎక్కించి వినియోగించుకుంటున్నారు. ఆ నీరు కూడ సరిపోక ఆరు బోర్లకు మోటార్లు బిగించారు.

**పది బోర్లకు మోటార్లు..**

అడవిసోమన్‌పల్లిలో పది బోర్లకు మోటార్లు బిగించి నీటిని వినియోగించుకుంటున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ కింద ఇచ్చిన నీటి కనెక్షన్లకు బిరడాలు బిగించకపోవడంతో నీరంతా వృథా అవుతుంది. అధికంగా నీటిని వినియోగించుకుంటున్న మంథని, ఎగ్గాస్‌పూర్, సూరయ్యపల్లి, గుంజపడుగు గ్రామాల గురించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని మిషన్ భగీరథ డీఈఈ కిరణ్ పేర్కొన్నారు.

# వీరమల్లు సైద్ధాంతిక విన్యాసం!

సినీనటుడు పవన్ కల్యాణ్ జనసేన పార్టీని స్థాపించి పుష్కర కాలం పూర్తయింది. పిఠాపురంలో నిన్న ఆ వేడుక వైభవంగానే జరిగింది. తాను అసెంబ్లీ గేటు తాకడానికి అవకాశం కల్పించిన పిఠాపురాన్ని ఈ రకంగా పవన్ గౌరవించారు. అసెంబ్లీ గేటును తాకే క్రమంలో పనిలో పనిగా కొన్ని తొడలు విరగ్గొట్టినట్టుగా కూడా ఆయన చెప్పారు. వీరమల్లు కదా, ఆ మాత్రం ఎలివేషన్ అవసరమే! పుష్కర సభ అంగరంగ వైభవంగా జరిగిందనీ, లక్షలాది జనసందోహంతో పొంగిపొరలిందనీ యెల్లో మీడియా వేనోళ్ల పొగిడింది. యెల్లో మీడియా సాధారణంగా చంద్రబాబుకూ, ఆయన పార్టీకీ మాత్రమే పరిమితం చేసే ప్రచార గౌరవాన్ని పవన్ సభకు కూడా కల్పించి ఔదార్యాన్ని చాటుకున్నది. అందులో ఒక పత్రిక సభలో జనగణన కూడా చేసింది. సభలో జనం కూర్చోవడానికి 14 ఎకరాలు కేటాయించారనీ, ఆ స్థలంలో లక్షలాదిమంది కిక్కి రిసిపోయారని రాసింది. జనం కిక్కిరిసి కూర్చుంటే ఎకరాకు ఐదు వేల మందిని లెక్కవేయడం ఆనవాయితీ. అంతకంటే ఐదు రెట్లు లేదా పది రెట్లు ఎక్కువగా కిక్కిరిశారని యెల్లో మీడియా చెబుతున్నది. ఏమో గుర్రం ఎగరావచ్చు! ఎవరికీ అభ్యంతరం లేదు. జనం కూర్చోవడానికి కేటాయించిన స్థలం 14 ఎకరాలు కాదని, తొమ్మిదెకరాలు మాత్రమేనని స్థానికుల సమాచారం. ఆ స్థానికులు గిట్టనివారు కావచ్చు. యెల్లో మీడియా రాసిందే అక్షర సత్యం కావచ్చు. సభ విజయవంతమైనందుకు పవన్ కల్యాణ్‌కు సనాతనాభివందనాలు! ఇప్పుడు పవన్ కల్యాణ్ అధికారంలో భాగస్వామి. ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. కనుక ఎన్నికల హామీల అమలు గురించో, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాల గురించో మాట్లాడుతారని జనం ఆశించడం సహజం. కానీ, అటువంటి ఆశలకు ఆయన అవకాశం ఇవ్వలేదు. కాలు వల కింద కూడా ఎండిపోతున్న పంటల గురించి ఆయన మాట్లాడలేదు. చెమటోడ్చి తెచ్చిన పంటలకు పడిపోతున్న ధరల గురించీ ఆయన మాట్లాడలేదు. అవసరమైన ఔషధా లతో, అందుబాటులో వైద్యులతో తొమ్మిది నెలల కిందటి దాకా ధైర్యం నింపిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పుడు వెలవెల బోతున్న వైనం కూడా ఆయన ప్రసంగంలో చోటు చేసుకోలేదు. అధోముఖయానం చేస్తున్న జీఎస్టీ వసూళ్ల సాక్షిగా ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం గురించిన ప్రస్తావనే రాలేదు. పేద, మధ్యతరగతి వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపిన విద్యా విప్లవానికి ఎందుకు కళ్లెం వేశారన్నదానిపై వివరణే వినిపించ లేదు. డొక్కా సీతమ్మ పేరు పెట్టి ఇంటర్ విద్యార్థుల కోసం ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకం నెల తిరక్కుండానే పరమ నాసిరకంగా ఎందుకు దిగజారిందో ఆయన చెప్పలేదు. ఆర్‌బీకే సెంటర్లలో అందుబాటులో లేకుండా ఎరువులూ, విత్తనాలూ ఎందుకు అదృశ్యమయ్యాయో, ఇల్లిల్లూ తిరిగి సేవలందించిన వలంటీర్లు ఏమయ్యారో అనే విషయాల గురించి పవన్ మాట్లాడలేదు. ఎమ్మెల్యేలూ, నాయకులూ జనం మీద పడి దోచుకుతింటున్నారని యెల్లో మీడియానే కోడై కూస్తున్నది. పంపకాల్లో తేడా లతో కూటమి నాయకులు కాట్లాడుకుంటున్నారని




కూడా పచ్చ కోడి గూడెక్కి కూస్తున్నది. అధికారులు కలెక్షన్ కౌంటర్లు తెరిచి అక్కడ వారి సతీమణుల్ని కూర్చోబెడుతున్నారని కూడా ఆరోప ణలు చేస్తున్నది. ఇటువంటి కీలక విషయాల జోలికి ఆయన వెళ్లలేదు. లౌకిక విషయాల గురించి ఆయన మాట్లాడ దలుచు కోలేదు. ఆయన ప్రసంగమంతా అలౌకిక పారవశ్యమే! ఈ సభ ద్వారా ఆయన మూడు అంశాలను చెప్పదలుచు కున్నట్టు మనం అర్థం చేసుకోవాలి. మొదటి నుంచీ ఆయన రాజకీయ ప్రయాణమంతా సిద్ధాంతబద్ధంగానే సాగిందని జనం నమ్మాలనేది ఆయన మొదటి పాయింట్. బాల్యం నుంచే తాను సనాతన ధర్మం కోసం పోరాడుతున్నానని చెప్పుకోవడం, తద్వారా ఆ శ్రేణుల్లో అగ్రభాగాన నిలబడాలని కోరుకోవడం రెండో పాయింటు. కొందరు విశ్లేషకులు, మరికొందరు మీడియా వ్యక్తులు ఊహిస్తున్నట్టు కూటమిలో విభేదాలేమీ ఉండబోవనీ, అక్కడ మోదీకీ %-% ఇక్కడ బాబుకూ విధేయుడనే అనే సందేశాన్ని శ్రేణులకు పంపించడం మూడో పాయింటు. లెఫ్ట్ నుంచీ సెంటర్‌కూ, అక్కడి నుంచి రైట్‌కూ తన సిద్ధాంత విధేయత మారిందని మీడియాలో వస్తున్న విమర్శలపై పవన్ కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. చేగువేరాను తాను అభిమానించడానికి కారణం అతను కమ్యూనిస్టు కావడం కాదట! వైద్యవృత్తిని వదిలేసి విప్లవకారుడుగా మారినందు వల్లనే అభిమానించానని చెప్పుకొచ్చిన పవన్ కల్యాణ్ భాషణపై సీపీఎం అగ్రనాయకుడు బీవీ రాఘవులు వ్యంగ్యంగా స్పందించారు. చేగువేరా మెడిసిన్ చదివిన మాట నిజమే కానీ, ఆయన వైద్యవృత్తిలో ఎప్పుడున్నారో నాకైతే తెలియదన్నారు. నిజంగానే వైద్యుడిగా చే ప్రాక్టీస్ చేసిందేమీ లేదు. అంతర్జాతీయ విప్లవ కారుడుగానే ఆయన ప్రసిద్ధుడు. చేగువేరా మీద అభిమానానికి పవన్ చెప్పిన కారణమే నిజమైతే, విప్లవాలు యుద్ధాల వీధి గుమ్మాల్లో నిలబడి వైద్యసే వలందించిన డాక్టర్ నార్మన్ బెథూన్, డాక్టర్ ద్వారకానాద్ కోట్నీస్‌ల అభిమానిగా ఆయన మారి ఉం డాలి. అసలు ప్రాక్టీసే చేయని చేగువేరాను విప్లవ కర వైద్యుని కోటాలో అభిమానించడం అనే కథ సరిగ్గా అతకలేదు. తాను బాల్యం నుంచే సనాతనవాదినని పవన్ ఈ సభలో చెప్పుకున్నారు. సనాతన ధర్మం తన రక్తంలోనే వుందని చెప్పారు. పద్నాలుగేళ్ల వయసు నుంచే దీక్షలు చేస్తున్నట్టు కూడా చెప్పారు. తనపై సినిమాల ప్రభావం బాగా ఎక్కువని కూడా పవన్ అంగీకరించారు. సినిమాలు, కథలు, నవలలతో బాగా ప్రభావితమయ్యే వ్యక్తులు కొందరు వాటిలోని పాత్రలతో తమను పోల్చుకోవడం అనే ఫ్యాంటసీలో మునిగి తేలుతుంటారు. చేగువేరా ప్రభావం బాగా ఉన్న రోజులో తమ తండ్రి గారు కమ్యూనిస్టని పవన్ చెప్పేవారు. అంతటితో ఆగకుండా, నానమ్మ దీపారాధన చేస్తుంటే ఆ దీపంతో నాన్నగారు సిగరెట్ కాల్చుకునేవారని కూడా ఒక సందర్భంలో ఆయన చెప్పారు. ఇంతకన్నా అవగాహనా రాహిత్యం ఇంకొకటి ఉండదు. కమ్యూనిస్టు లంటే దైవదూషకులనే అర్థం ఇందులో స్ఫురిస్తున్నది. కమ్యూనిస్టు అయినంత మాత్రాన నాస్తికుడై ఉండాలనేదేమీ లేదు. నాస్తికుడైనంత మాత్రాన దైవదూషణ చేస్తారనీ, అవమానిస్తా రనీ అర్థం కాదు. వారి వారి విశ్వాసాలకు, నమ్మకాలకు కట్టుబడి ఉంటారంతే! దైవదూషణ వంటి పనులకు విశ్వాసాలతో సంబంధం లేదు. అది వ్యక్తిగతం. పూజా పునస్కారాలు చేసే సంప్రదాయ కుటుంబాల్లో పుట్టిన నిగమశర్మ వంటి వారి కథలు కూడా మనం విన్నాము. ఇప్పుడాయన సనాతన ధర్మ ప్రభావానికి లోనైన తర్వాత కుటుంబ కథలో కొంత మార్పు చేశారు. కేవలం ఇరవయ్యేళ్ల వయసులోనే నాన్నగారు కమ్యూనిస్టు భావజాలంతో ఉండే వారని, ఆ తర్వాత రామభక్తుడిగా మారారని పిఠాపురం సభలో పవన్ చెప్పారు. తన చిన్నతనం నుంచే ఇంట్లో రామ నామ జపం వినిపించేదని ఆయన అన్నారు. న సనాతనధర్మ నిబద్ధతపై ఎవరూ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదనీ, ఈ దేశం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమేనని మరోసారి ఆవేశం ప్రదర్శించారు. ఇదంతా ఎందుకంటే, తాను చిన్నతనం నుంచీ సిద్ధాంత నిబ ద్ధతతోనే ఉన్నాననీ, ఆ సిద్ధాంతం సనాతన ధర్మమేననీ ఇప్పు డాయన సవరణ చేయదలుచుకున్నారు. చేగువేరా కమ్యూనిస్టని కాదు... మంచి వైద్యుడూ, విప్లవ కారుడైనందువల్ల అభిమానించారు. మరి శ్రీశ్రీ, దాశరథి, శేషేంద్ర వంటి వారి సంగతేంది అవకాశం దొరికిన ప్రతిసారీ వారి కవితా పంక్తుల్ని వల్లెవేయడం పవన్‌కు అలవాటు. వారు సనాతనవాదులా సామ్యవాదులా పిఠాపురం సభలో కూడా దాశరథినీ, శ్రీశ్రీని ఆయన తలచుకున్నారు. "ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో, ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో..." అనే దాశరథి గేయం సామ్యవాద గీతమా సనాతనవాద గీతమా. ప్రసంగాన్ని ముగిస్తూ శ్రీశ్రీ మహాప్రస్థానంలోని 'అవతారం' కవితను ఆసాంతం చదివి వినిపించారు. "యముని మహిషపు లోహఘంటలు మబ్బుచాటున ఖణేల్‌మన్నాయి / నరకలోకపు జాగిల మ్ములు / గొలుసు త్రెంచుకు ఉరికి పడ్డాయి / ఉదయ సూర్యుని సప్త హయములు / నురుగులెత్తే పరుగు పెట్టేయి / కనకదుర్గా చండసింహం జూలు దులిపీ, ఆవులించింది..." ... ఇలా పురాణ ప్రతీకలతో సాగిపోతుందా కవిత. ఇంతకాలం ఈ ప్రతీకలన్నీ ప్రభవించబోయే విప్లవానికి సూచికలుగా భావించారంతా! మరి సనాతన ధర్మ పరిరక్షణా యాత్రికునికి ఈ కమ్యూనిస్టు విప్లవ ప్రతీకలెందుకో! ఆయన విడమరిచి చెబితే తప్ప సామాన్యులకు అర్థం కాదు. ఆయన ప్రసంగంలో ఒకపక్క చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తు తూనే మోదీ తరఫున వకాల్తా పుచ్చుకొని తమిళనాడులోని డీఎమ్‌కే పార్టీ మీద దాడి చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేయబోతున్నదనీ, దీనిపై ఐక్యంగా పోరాడదామనీ ఆ పార్టీ వాళ్లు వాళ్ల ప్రయత్నమేదో చేస్తున్నారు. బీజేపీ దీర్ఘకాల లక్ష్యాలకు ఇటువంటి చిన్నచిన్న ప్రయత్నాలు కూడా విఘాతం కలిగిస్తా యని బీజేపీ పెద్దలకు బాగా తెలుసు. వారి మనసెరిగి పవన్ ప్రసంగించారు. అప్పుడెప్పుడో చిన్నతనంలో ఆయన మద్రా స్‌లో ఉన్నప్పుడు తమిళుడెవరో 'గొల్టీ' అని గిచ్చాడట! దాన్ని ప్పుడు గుర్తుచేసుకున్నారు. పవన్ సభ ప్రారంభానికి ముందే చంద్రబాబు, లోకేశ్ బాబు ఆయనకు శు భాకాంక్షలు తెలియజేశారు. యెల్లో మీడియా ఆ సభకు పూర్ణకుంభ స్వాగతం పలికింది. ఈ మూడు పార్టీల కూటమిలో లుకలుకలున్నాయనీ, విడిపోతాయనీ, బీజేపీ %-% జన సేన కలిసి ఒక కూటమిగా ఏర్పడుతాయనీ ఊహిస్తున్న విశ్లేష కులు ఇప్పటికైనా తమ ఆలోచనల్ని సరిదిద్దుకోవాలి. విభేదా లేమీ లేవు. ముగ్గురూ కలిసి పనిచేస్తారు. బీజేపీ%-%సంఘ్ పరి వార్‌ల దీర్ఘకాలిక లక్ష్యానికి సహకరిస్తూనే మిగిలిన ఇద్దరు ఎవరి ఇంటిని వాళ్లు చక్కదిద్దుకుంటారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం లోకేశ్‌ను సీఎం కుర్చీలో త్వరగా కూర్చోబెట్టాలనే ఒత్తిడి బాబు మీద పెరుగుతున్నది. ఆ పరిస్థితుల్లో డిప్యూటీగా ఉండటం పవన్‌కు ఇబ్బంది కనుక ఆయన కేంద్రానికి వెళతారనీ, వచ్చే ఎన్నికల నాటికి దక్షిణాదిన బీజేపీ తరఫున సనాతన ప్రచారానికి ఆయనను నియోగిస్తారని తెలుస్తున్నది. పవన్ స్థానంలో నాగబాబు రాష్ట్ర కేబినెట్‌లోకి రావచ్చు. జనసేన కార్య కర్తలు ఇంతకంటే పెద్ద దృశ్యాన్ని ఆశిస్తే నిరాశ తప్పకపోవచ్చు.

# కొత్తగా ఐదు సైబర్ క్రైమ్ ఠాణాల యోచన

**జోన్‌కు ఒకటి చొప్పున ఏర్పాటుకు నిర్ణయం**

**ప్రభుత్వానికి సైబరాబాద్ ఉన్నతాధికారుల ప్రతిపాదనలు**

**ఏటా నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం**

హైదరాబాద్: సైబర్ నేరాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. ఎక్కడో విదేశాల్లో నక్కి, కమీషన్ల ఆశ చూపించి మధ్యవర్తులు, షెల్ కంపెనీలతో సైబర్ నేరస్తులు రూ.కోట్లు కొట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలను మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు సైబరాబాద్ పోలీసులు సన్నద్ధమవుతున్నారు. కొత్తగా ఐదు సైబర్ క్రైమ్ ఠాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు




సిద్ధం చేశారు. కమిషనరేట్ పరిధిలో జోన్‌కు ఒకటి చొప్పున ఉండేలా కసరత్తు చేస్తున్నారు.

**అత్యధికంగా ఇక్కడే..**

రాష్ట్రంలో అత్యధికంగా సైబర్ నేరాలు నమోదయ్యే పోలీసు యూనిట్లలో సైబరాబాద్ కమిషనరేట్ తొలి స్థానంలో ఉంది. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రానికి కీలకమైన ఐటీ కారిడార్‌తో పాటు అంతర్జాతీయ సంస్థలు సైబరాబాద్ పరిధిలో ఉన్నాయి. వీటికి తోడు వివిధ రాష్ట్రాలకు చెందిన ఐటీ సంస్థలూ ఇక్కడే ఉన్నాయి. ఫలితంగా కేసుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. గతేడాది కమిషనరేట్‌లో 11,914 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో బాధితులు రూ.7,93,18,94,102 సొమ్మును పోగొట్టుకున్నారు. ప్రస్తుతం రోజుకు సగటున 30%-% 35 కేసులు నమోదవుతున్నాయి.

**అరెస్టులు 5 శాతం కంటే తక్కువే..**

ప్రస్తుతం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఒక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఉంది. రూ.50 వేల కంటే తక్కువ పోగొట్టుకుంటే స్థానిక స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు. అంతకుమించి అయితే సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ క్రైమ్ కేసులలో డబ్బు రికవరీ సగటున 30 శాతం మించడం లేదు. నేరగాళ్ల అరెస్టులు సగటున 5 శాతం కూడా ఉండటం లేదు.

# రూ. 100 కోట్ల భూమికి ఎసరు

హైదరాబాద్: దాదాపు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కొందరు అక్రమార్కులు పన్నిన పన్నాగాన్ని అధికారులు గుర్తించారు. స్థలాన్ని కాజేసేందుకు తప్పుడు డాక్యు మెంట్లు సృష్టించిన వ్యక్తులపై పేట్‌బషీ రాబాద్ పోలీస్ స్టేషన్ (pet basheerabad police station)లో కేసులు నమోదయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కుత్బుల్లాపూర్ (Quthbullapur) మండల పరిధిలోని సర్వేనెంబర్ 48లో యూఎల్‌సీ భూమి 5,800 గజాలు జీడిమెట్ల (Jeedimetla) పేట్ బషీరాబాద్ గ్రామ పరిధిలో ఉన్నట్లు పాత రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓ ఎమ్మెల్సీ ప్రోద్బలంతో కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి హెచ్ఎండీఏ (HMDA) నుంచి 15 ఫ్లోర్లకు అనుమతులు పొంది నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని గుర్తించిన రెవెన్యూ అధికారులు 2001లో అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధికారులు నిర్వహించిన సర్వే మ్యాప్‌తో పాటు ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణం పరిశీలించి మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు నివేదించారు. సమగ్ర విచారణ జరిపించి అది యూఎల్‌సీ స్థలమే అని నిర్ధారించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పాతారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు రతన్ కుమార్, శ్రీనివాసరావు, శేఖర్ బాబు, వెంకట్రావు, సతీష్ బాబుల తోపాటు జిష్ణు ఇన్ఫ్రా కన్‌స్ట్రక్షన్స్‌పై కేసు నమోదు చేశారు. ఈ స్థలం విలువ దాదాపు రూ.100 కోట్ల పైగానే ఉంటుందని అంచనా వేశారు. ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువచేసే ఈ స్థలం కబ్జా కాకుండా జిల్లా కలెక్టర్, మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో ఎట్టకేలకు విలువైన స్థలం ప్రభుత్వ సొంతం అయింది.

# 'రూ'పం... సారం



నిరుడు లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి వరసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకొచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి విపక్షాల ఆధ్వర్యంలోని రెండు రాష్ట్రాలు గట్టి ప్రతిఘటననిస్తున్నాయి. ఇందులో తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం బెంగాల్‌లోని తృణమూల్ సర్కారుకన్నా ఒకడుగు ముందుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఒకపక్క నియోజక వర్గాల పునర్విభజన, మరోపక్క హిందీ భాష పెత్తనం అనే రెండు పదునైన ఆయుధాలతోకేంద్రాన్ని ఇరకాటంలో పడేస్తున్నారు. పార్లమెంటులోనూ, వెలుపలా ఈ రెండింటిపైనా విస్తృతమైన చర్చ జరిగేలా చూస్తున్నారు. నిత్యం పతాక శీర్షికలకెక్కుతున్నారు. శుక్రవారం ప్రవేశపెట్టే 2025%-%26 రాష్ట్ర బడ్జెట్ లోగో లోని హిందీ అక్షరం'రూ' బదులు తమిళ అక్షరం 'రూ'ను వినియోగించబోతున్నామని గురువారం స్టాలిన్ ప్రకటించటం అందులో భాగమే. అయితే తమ ఉద్దేశం తమిళభాష ఔన్నత్యాన్ని పెంచటమే తప్ప, హిందీని వ్యతిరేకించటం కాదని డీఎంకే ప్రతినిధి శరవణన్ వివరణనిచ్చారు. హిందీ 'రూ' జాతీయ కరెన్సీ అధికారిక చిహ్నంగా 2010 జూలై నుంచి అమల్లోవుంది. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్టితోనే డీఎంకే ఇలాంటి విన్యాసాలు చేస్తున్న దని బీజేపీ అంటున్నా, ఆ పార్టీ లేవనెత్తుతున్న రెండు అంశాలూ కొట్టిపారేయదగ్గవి కాదు. రాజ్యాంగం నిర్దేశించిన ఫెడరలిజం భావనను కేంద్రం నీరుగారుస్తోందన్న అభిప్రాయం రాష్ట్రాల్లో బలపడనట్టయితే డీఎంకే లేవనెత్తిన అంశాలకు ఇప్పుడున్నంత ప్రాముఖ్యత లభించేది కాదన్నది వాస్తవం. ఇంతకూ జాతీయ కరెన్సీ చిహ్నం రూపొందించింది తమిళనాడు వ్యక్తి, పైగా డీఎంకే మాజీ ఎమ్మెల్యే కుమారుడు. కనుకనే డీఎంకే నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ చిహ్నంలో హిందీ అక్షరమేవున్నా ఇంగ్లిష్ అక్షరం 'ఆర్'ను కూడా పోలివుండటం దాని ప్రత్యేకత. కానీ సమస్య తలెత్తినప్పుడు ఇవన్నీ మరుగున పడతాయి. ఆ సంగతలా వుంచి ఈ అంశంలో బీజేపీ స్పందనలు శ్రుతిమించాయి. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కరెన్సీ చిహ్నం మార్పు దేశ ఐక్యతను బలహీనపరిచే ప్రమాదకరమైన మనస్తత్వం పర్యవసానమని అభివర్ణించారు. హిందీ అమలుకు అనుసరించే విధానాలవల్లే ఆ భాషపై వ్యతిరేకత వస్తోంది. ఇది బీజేపీతో మొదలు కాలేదు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోవున్నా ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. వాటికి ఎప్పటికప్పుడు ప్రతిఘటన వస్తూనే వున్నది. 2008లో యూపీఏ సర్కారు హిందీ వాడకాన్ని పెంచడానికంటూ విడుదల చేసిన సర్క్యులర్‌పై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మెట్రిక్, ఆపై స్థాయి అభ్యర్థులకు కేంద్ర నియామకాల కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో తప్పనిసరిగా హిందీ ప్రశ్నపత్రం ఉండాలన్నది సర్క్యులర్ సారాంశం. తమ పార్టీ ఆధ్వర్యంలోని యూపీఏ సర్కారే దీన్ని తీసుకొచ్చినా అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఇతర ప్రశ్న పత్రాల్లో మెరుగైన మార్కులు వచ్చినా హిందీలో ఫెయిలైతే ఉద్యోగానికి అనర్హులవు తారని ఆ ప్రతిపాదన తెలిపింది. ఇది హిందీ భాషా ప్రాంతాల అభ్యర్థులకే లాభిస్తుందనీ, దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనీ వైఎస్ లేఖ రాశారు. చివరకు ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2014, 2017, 2019లలో సైతం కేంద్రం ఈ మాదిరి ప్రతిపాదనలే ముందుకు తోసింది. ఇంగ్లిష్‌కు ప్రత్యామ్నాయంగా హిందీ ఉండాలని రెండేళ్ల క్రితం కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నప్పుడు కూడా వివాదం రేగింది. జాతీయ విద్యావిధానం%-%2020తో తమిళనాడుకు పేచీవుంది. తాము ఎప్పటినుంచో వ్యతిరేకి స్తున్న త్రిభాషా సూత్రాన్ని తీసుకురావటమే ఆ విద్యావిధానం సారాంశమని డీఎంకే అంటున్నది. ఆ విధానం ప్రకారం విద్యార్థి మాతృ భాషతోపాటు ఇంగ్లిష్, మరేదైనా దేశీయ భాష నేర్చుకోవాలన్న నిబంధన వుంది. హిందీయే నేర్చుకోవాలని అందులో లేదన్నది నిజమే కావొచ్చుగానీ... వేరే భాష నేర్చుకోవాలనుకుంటే ఆ భాషా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండే అవకాశముందా? హిందీ ప్రాంతాల్లో దక్షిణాది భాషలు నేర్పే టీచర్లే లేరు. అసలు ఈ త్రిభాషాసూత్రం వల్ల ఈ స్థాయిలో మేలు జరిగిందని చెప్పే గణాంకాలున్నాయా? జాతీయ విద్యావిధానం అమలు చేయలేదన్న కార ణంతో సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద కేంద్రం నుంచి రావాల్సిన 2,152 కోట్లను నిలిపివేశారని తమిళనాడు ఆరోపిస్తోంది. ఎస్ఎస్ఏకు రావాల్సిన ఆ నిధులను సొంత వనరులనుంచే సమీకరించాలని నిర్ణయించినట్టు ఆ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించారు. హిందీకి వ్యతిరేకమనో, నూతన విద్యావిధానానికి వ్యతిరేకమనో చూపి నిధులు ఆపేయటం ఒత్తిడి తీసుకొచ్చే మార్గమనికేంద్రం అనుకోవచ్చుగానీ... దీన్ని బెదిరించటంగా, బ్లాక్‌మెయిల్‌గా తమిళనాడు పరిగణిస్తోంది. విద్యాపరంగా చూసినా, పన్నుల వసూళ్లపరంగా చూసినా తమిళనాడు అనేక రాష్ట్రాలకన్నా ఎంతో ముందుంది. అందుకు ఇదా బహుమతి అనే ప్రశ్న తలెత్తదా? అమల్లోకి తీసుకురాదల్చుకున్న ఏ విధానంపైన అయినా సమగ్ర చర్చ జరపడం, అపోహల్ని తొలగించటం అవసరమని కేంద్రం గ్రహించాలి. ప్రాథమిక స్థాయి విద్య మొదలుకొని విశ్వవిద్యా లయ విద్యవరకూ అన్నింటా తన ఆధిపత్యమే ఉండాలన్న ఆత్రుత వేరే పర్యవసానాలకు దారి తీస్తున్నదని గుర్తుంచుకోవాలి. రాష్ట్రాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజారిస్తే, ఫలానా పథకం అమలు చేయలేదన్న కారణం చూపి నిధులు ఎగ్గొడితే సాధారణ ప్రజలకు వేరే సంకేతాలు పోతాయి. ఆ పరిస్థితి తలెత్తకుండా చూసుకోవటం కేంద్రం బాధ్యత.

## కల్యాణ వేడుక చూతము రారండి

వేములవాడ: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం శివకల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను అయిదు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. ఆదివారం ఉదయం ఆలయ వేద పండితులు, అర్చకులు స్వస్తి పుణ్యాహవచనం కార్యక్రమాన్ని వేద మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం పంచగవ్య మిశ్రమం, దీక్షాబంధనం, రుత్విక్‌వరణం, మంటప ప్రతిష్ఠ, మంటప ప్రవేశం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, వాస్తు హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శివపురాణ ప్రవచనాలను చేపట్టారు. రాత్రి బేరీపూజ, దేవతాహ్వానం, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కల్యాణ మండపంలో ఆలయ వేద పండితులకు, అర్చకులకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి దీక్షా వస్త్రాలను అందజేశారు.

**తరలి రానున్న శివ పార్వతులు**

రాజన్న ఆలయంలో సోమవారం జరిగే శివకల్యాణోత్సవానికి రాష్ట్రం నలు మూలల నుంచి వేలాదిగా శివపార్వతులు, భక్తులు తరలి రానున్నారు. కల్యాణోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున శివపార్వతులు రాజరాజేశ్వరస్వామివారికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. మరి కొందరు శివపార్వతులే ఒకరికొకరు తలపై జీలకర్ర బెల్లం పెట్టుకొని మెడలో పసుపు తాడు కట్టుకుని తలంబ్రాలు పోసుకొని స్వామివారిని పెళ్లాడినట్లు ఊహించుకుని వేడుకల్లో తన్మయం పొందుతారు.

**ప్రత్యేక వేదిక ఏర్పాటు**

ఆలయంలో సోమవారం ఉదయం 10.40 గంటల నంచి 12.55 గంటల వరకు శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివార్ల కల్యాణ వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. కల్యాణోత్సవ నిర్వహణకు ఆలయ ఈవో కార్యాలయం ముందు ప్రత్యేంగా వేదిక సిద్ధం చేసి రంగు రంగుల పూలతో అందంగా తీర్చిదిద్దారు. ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను పల్లకిలో తీసుకువచ్చి వేదిక వద్ద ప్రతిష్ఠించి కల్యాణ క్రతువు నిర్వహించనున్నారు. ఉదయం తీర్థరాజస్వామిపూజ, దేవతాహవనం, ధ్వజారోహనణం, ఎదుర్కోలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## నారీ..నవోత్తేజం

ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో కొత్త సంఘాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. పురపాలికల్లోని మహిళలను నూతన ఎస్‌హెచ్‌జీలలో చేర్పించేందుకు మెప్మా సిబ్బందికి బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు వారు కొత్త సంఘాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

**ఇవీ ప్రయోజనాలు**

నూతన సంఘాల మహిళలకు బ్యాంకు అనుసంధాన రుణాలు అందించనున్నారు. వీటితో వారికి నచ్చిన వ్యాపారాలను ఎంచుకొని చేసుకోనున్నారు. ఇప్పటికే ఇందిరా మహిళా శక్తి పథకం కింద సభ్యులు వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేశారు. మిగతా సంఘాల మహిళలకు కూడా అదే తరహాలో అందించి ప్రోత్సహించనున్నారు.

**లక్ష్యం 175.. ఏర్పాటు 94 సంఘాలు**

సూర్యాపేట జిల్లాలోని 5 పురపాలికల్లో మొత్తం 175 కొత్తగా సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. అందులో ఇప్పటివరకు 94 సంఘాలు ఏర్పాటయ్యాయి. కోదాడ పురపాలిక 75 శాతం పూర్తి చేసుకుని ముందంజలో ఉంది. ఈ నెలాఖరు నాటికి లక్ష్యం పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. పట్టణాల్లోని మహిళలు 15 ఏళ్ల నుంచి 60 ఏళ్లు కలిగిన వారు అర్హులు. కొత్త సంఘాల్లో అర్హులు చేరాలి : రేణుక, మెప్మా ఇన్‌ఛార్జి పీడీ, సూర్యాపేట రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన మహిళలను సంఘంలో చేరేలా అవగాహన కల్పిస్తున్నాం. చేరిన సభ్యులకు ఇందిరాశక్తి పథకం కింద రుణాలు మంజూరు చేయించి క్యాంటీన్లు, ఇతర వ్యాపారాలు ఏర్పాటు చేయించాం. ఈ నెలాఖరు వరకు లక్ష్యం మేరకు సంఘంలో సభ్యులను చేర్పిస్తాం.

# మండే ఎండల్లో మరమ్మతు ప్రహసనం




ఏటా మార్చి చివరి వారం నుంచి ఏప్రిల్ వరకు విద్యుత్తు నియంత్రికలు అధికంగా కాలుతుండగా మరమ్మతులు ప్రహసనంగా మారాయి. మరమ్మతుకు మూడు జిల్లాల పరిధిలో 24 ఎస్‌పీఎంలు(స్పెషల్ మెయింటెనెన్స్ సెంటర్స్-ప్రత్యేక నిర్వహణ కేంద్రాలు) ఉన్నాయి. ఒక్కో ఎస్‌పీఎంలో రోజుకు రెండు నియంత్రికలను మరమ్మతు చేయగలుగుతున్నారు. అదనపు నియంత్రికలు అందుబాటులో లేక సరఫరా పునరుద్ధరణకు కొన్నిసార్లు నాలుగైదు రోజులు పట్టి పంటలు ఎండుతున్నాయి. కాలిపోవడానికి కారణాలు నియంత్రికలపై అధిక లోడు, పిడుగుపాట్లు. ఎల్‌టీ లైన్లకు చెట్ల కొమ్మలు తగిలి తీగలు పరస్పరం తాకడం. నియంత్రికల ఎర్తింగ్‌ను తరచూ తనిఖీ చేయకపోవడం. ఏబీ స్విచ్‌లు వదులుగా ఉండటం. రేటింగ్ ఫ్యూజు వైర్లు కాకుండా లావుగా ఉన్న తీగలు వేయడం. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పంపుసెట్ల వద్ద ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలి. కెపాసిటర్లు బిగించుకుంటే వోల్టేజీ సమానంగా ఉంటుంది. సరఫరాలో సమస్య తలెత్తినప్పుడు విద్యుత్తు సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

**ఇవీ సమస్యలు**

క్షేత్ర స్థాయి విద్యుత్తు సిబ్బందిలో చాలా మంది స్థానికంగా ఉండటం లేదు. మాల్లో పనులన్నీ స్థానిక తాత్కాలిక సిబ్బందితో చేయిస్తున్నారు. నియంత్రికల వద్ద ఫ్యూజులు కాలినప్పుడు 'ఎల్‌సీ' తీసుకొని రైతులనే వేసుకోమంటున్నారు. లైన్ల నిర్వహణ, చిన్నచిన్న పనులకు సైతం ప్రైవేటు ఎలక్ట్రిషియన్లపై ఆధారపడుతున్నారు. కాలిన నియంత్రికలను మరమ్మతు కేంద్రానికి తరలించేందుకు సబ్‌డివిజన్‌కు ఒక వాహనం మాత్రమే ఉంది. వాహనం పంట పొలాల్లోకి వెళ్లేందుకు రహదారులు అనువుగా లేక అద్దె ట్రాక్టర్లపై తరలించాల్సి వస్తోంది. లాల మధ్య నుంచి నియంత్రికలను బయటకు మోసుకొచ్చేందుకు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోంది,

# హెచ్‌ఎండీఏ విస్తరణతో డీటీసీపీకి బ్రేక్

**హైదరాబాద్:** ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా, సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించకుండానే ఆగమేఘాల మీద హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)ను ట్రిపుల్ ఆర్ వరకు విస్తరిస్తూ తెచ్చిన జీఓ.. రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేసేలా మారింది. నిర్మాణ రంగం కూడా మరింత బలహీన పడే పరిస్థితి నెలకొంది. ఇంచుమించు ఏడాదిన్నరగా చతికిల పడ్డ 'రియల్ భూమ్'ను ఇది మరింత భూస్థాపితం చేసేలా మారిందని నిర్మాణరంగ నిపుణులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల నుంచే ప్రభుత్వ ఖజానాకు అత్యధిక ఆదాయం లభించింది. నగరం చుట్టుపక్కల ఉన్న భూములు బంగారం కంటే ప్రియంగా మారాయి. అపార్ట్‌మెంట్‌లు, బహుళ అంతస్తుల భవనాలు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యాయి. హెచ్‌ఎండీఏ (HMDA) భూములకు సైతం భారీ డిమాండ్ వచ్చింది. ఔటర్ రింగ్ రోడ్డు (Outer ring road) పరిధిలో ఎక్కడ హెచ్‌ఎండీఏ భూములను అమ్మకానికి పెట్టినా రూ.వందల కోట్ల ఆదాయం లభించింది. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలతో రియల్ రంగం వెనుకంజ వేసింది. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ విస్తరణతో తిరిగి కొంత రియల్ భూమ్ రావచ్చని మొదట్లో భావించారు. కానీ.. ఏ విధమైన ప్రణాళికలు, విధి విధానాలు లేకుండానే ఆకస్మికంగా జీఓ తేవడంతో అనుమతులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ముఖ్యంగా ఇప్పటి వరకు డైరెక్టరేట్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) నుంచి లభించే అనుమతులకు తాజాగా బ్రేక్ పడింది. దీంతో తీవ్ర గందరగోళం నెలకొంది.

**అనుమతులు ఇచ్చేదెవరు?**

ఇప్పటికే డీటీసీపీ పరిధిలో భూములు కొనుగోలు చేసి లేఅవుట్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న రియల్టర్లకు ఎలాంటి సమాధానం లభించడం లేదు. ప్రస్తుతం లే అవుట్ అనుమతుల అంశం తమ పరిధిలో లేదంటూ డీటీసీపీ అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన నిర్మాణదారులు రెండు, మూడు రోజులుగా హెచ్‌ఎండీఏకు తరలివస్తున్నారు. కానీ.. హెచ్‌ఎండీఏలో సైతం చుక్కెదురే కావడం గమనార్హం. ట్రిపుల్ ఆర్ వరకు తమ పరిధి పెరిగినప్పటికీ ఇంకా ఎలాంటి విధివిధానాలు రాలేదని చెబుతున్నారు. మరోవైపు కొత్త మాస్టర్‌ప్లాన్ వస్తే తాము అనుమతులు ఇవ్వలేమంటున్నారు. దీంతో రియల్టర్లు, వ్యాపార వర్గాలు, ఆర్కిటెక్టర్లు తదితర వర్గాలు ఆందోళనకు గురవుతున్నాయి. 'అనుమతుల కోసం కొంత కాలం ఆగాల్సిందేనంటున్నారు. కానీ.. ఎంతకాలం అనే దానిపై స్పష్టత లేకుండాపోయింది. పైగా మాస్టర్ ప్లాన్ లేకుండా అనుమతులను ఇవ్వడం కూడా సాధ్యం కాదు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఇది నష్టదాయకంగా మారింది' అని కందుకూరు ప్రాంతానికి చెందిన రియల్టర్ ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు బ్యాంకుల నుంచి, ఇతరత్రా రుణాలు తీసుకుని భూములు కొనుగోలు చేసిన వ్యాపారుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

**మాస్టర్‌ప్లాన్‌కు మరో ఏడాది..**

మొత్తం తెలంగాణ ప్రాంతాన్ని మూడు భాగాలుగా చేసి సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం ఏడాది క్రితం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఔటర్‌రింగ్ రోడ్డు వరకు కోర్ అర్బన్‌గా, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు సెమీ అర్బన్‌గా, రీజినల్ రింగ్ రోడ్డు నుంచి మిగతా తెలంగాణ అంతా రూరల్‌గా పరిగణిస్తూ రీజినల్ రింగ్ రోడ్డు వరకు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమగ్రమైన మాస్టర్‌ప్లాన్%-% 2050ని రూపొందించాల్సి ఉంది. కానీ.. ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన కోసం ఆసక్తి గల అంతర్జాతీయ సంస్థల నుంచి రిక్వెస్ట్ ప్రపోజల్స్‌ను ఆహ్వానించేందుకు త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు చెప్పారు. ఎంపిక చేసిన సంస్థ పూర్తిగా అధ్యయనం చేసి సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేసేందుకు కనీసం ఏడాది సమయం పట్టవచ్చని అంచనా. మాస్టర్ ప్లాన్ సిద్ధమైతే తప్ప హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు లభించవు. అంటే అప్పటి వరకు ట్రిపుల్ ఆర్ వరకు అన్ని రకాల నిర్మాణాలు, లే అవుట్‌లు, వెంచర్‌లు నిలిచిపోవాల్సిందేనా అనే సందేహం నెలకొంది. ఈ పరిణామం రియల్ ఎస్టేట్ భవిష్యత్‌ను మరోసారి ప్రశ్నార్థకంగా మార్చిందని ఆ రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**పరిస్థితి అగమ్యగోచరం..**

హైదరాబాద్ విస్తరణ పట్ల ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ.. అసలు మాస్టర్‌ప్లాన్ లేకుండానే విస్తరణ జీఓ ఇవ్వడం వల్ల స్పష్టత లేకుండా పోయింది. రియల్ ఎస్టేట్ రంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ రంగానికే కాదు హైదరాబాద్ అభివృద్ధికి కూడా ఇది నష్టమే.

## పొట్టి శ్రీరాములు గొప్ప దేశభక్తుడు

దేశం కోసం పోరాడిన గొప్ప దేశభక్తుడు పొట్టి శ్రీరాములు అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలోని పాల్గొని స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ వై.సునీల్‌రావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కన్న కృష్ణ, పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్, పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ అధ్యక్షుడు ఉప్పల రామేశం, నాయకులు పాల్గొన్నారు. అనంతరం తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ నర్సింహస్వామిని కేంద్ర మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఛైర్మన్ లక్ష్మణ్, ఈవో అనిల్ కుమార్ ఆయనకు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం తీర్థ ప్రసాదం అందజేసి సత్కరించారు

## అలంకారం కృషి ఆచార్యదే!

ఉత్సవాలలో అలంకారాలే ఉత్సాహం కలిగిస్తూ మహా సంబరంగా మార్చేస్తాయి. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లోనూ అత్యంత ప్రాధాన్యం కల్పించారు. స్వామివారి వాహన సేవను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతూ భక్తులను ఆకట్టుకున్నారు. ఆయనే శృంగారం ఆత్రేయాచార్యులు. పన్నెండేళ్లుగా ఆయన చేతుల్లో యాదగిరీశుడు వివిధ రూపాల్లో అలంకృతులై తీర్థ జనులకు కనులవిందు గొల్పుతున్నారు. నిండైన వస్త్రాలు.. ఒంటిపై తళతళ మెరిసే ఆభరణాలు.. చేతుల్లో ఆయుధాలతో భక్తులను అబ్బురపరిచేలా విగ్రహాలను అలంకరించడం అతనికి అబ్బిన విద్య. హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ ప్రాంతానికి చెందిన ఆత్రేయాచార్యులు దేవతామూర్తులను అలంకరిచండంలో దిట్ట. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, చెన్నైలోనూ పలు పర్వదినాలకు ఇతను అలంకరించేందుకు వెళ్తుంటారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు, దేవి నవరాత్రులు, దశావతారాలు, శ్రీకృష్ణ లీలలు విగ్రహం ఏదైనా ఇతను అలంకరించిన తర్వాత భక్తులు చూసి పరవశం చెందాల్సిందే.

**అలంకరిస్తున్న ఆత్రేయ ఆచార్య**

విగ్రహ అలంకారానికి మూడు గంటలు సమయం పడుతుందని ఆయన తెలిపారు. అవతారానికి తగ్గట్లు వస్త్రాలు, ఆభరణాలు, ఇతర అలంకరణ సామగ్రి తానే తెచ్చుకుంటానని, తుదిమెరుగులు దిద్దేందుకు పుష్పాలు, దళాలు సమకూర్చాల్సి ఉంటుందన్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి జరిగిన యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో నృసింహస్వామిని వివిధ రూపాల్లో అలంకరించారు. సింహ, హంస వాహనసేవలు ఆకట్టుకున్నాయని చెప్పారు.

**వంశపారంపర్యంగా..**

అలంకరణ విద్య వంశపారంపర్యంగా అబ్బిందన్నారు. తాతా శృంగారం కృష్ణమాచార్యులు అలంకరణలో సిద్ధహస్తుడని, అతని నుంచి తండ్రి రమణాచార్యులుకు, తండ్రి నుంచి తనకు ఈ అలంకరణ విద్య వచ్చిందన్నారు. ఇదంతా దైవ కృప అని, 2013 నుంచి యాదగిరిగుట్ట క్షేత్రానికి వస్తున్నానని తెలిపారు.

## అందులో చేరితే.. ఇక ఉన్నతులే..!

కేంద్రీయ విద్యాలయం(కేవీ) ప్రవేశాల ప్రకటన విడుదలైంది. 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కేంద్రీయ విద్యాలయం ఆహ్వానిస్తోంది. ప్రవేశం పొందిన పక్షంలో ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం ఉంది. ఆంగ్ల మాధ్యమంలో సీబీఎస్ఈ పద్ధతిలో ప్రయోగాత్మక, గుణాత్మక విద్యను కేవీలో అందిస్తున్నారు. అర్హులైన వారు ఈ నెల 21వ తేదీ సాయంత్రం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలును కల్పించారు. భువనగిరి కేంద్రీయ విద్యాలయంలో ప్రస్తుతం రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు 400 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో రెండు సెక్షన్ల ద్వారా ఒకటో తరగతిలో 80 మంది విద్యార్థులకు ప్రవేశం పొందే అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థి వయస్సు మార్చి 31 నాటికి ఆరు సంవత్సరాలు పూర్తయి ఉండాలి. విద్యాలయాల్లో ప్రవేశాల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని భువనగిరి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ చంద్రమౌళి తెలిపారు. దరఖాస్తు సమయంలో తప్పులు లేకుండా చూసుకోవాలి. పొరపాటు జరిగితే ఎడిట్ ఆప్షన్ ఉండదు.

**ప్రవేశాల్లో వీరికి ప్రాధాన్యం**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనికుల పిల్లలకు తొలి ప్రాధాన్యం. రెండో ప్రాధాన్యం కింద కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఉద్యోగుల పిల్లలకు ప్రవేశాలు. మూడోది: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు అవకాశం. నాలుగో: రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పిల్లలకు. విద్యాహక్కు చట్టం ప్రకారం నిరుపేదలకు ఐదో ప్రాధాన్యంగా ప్రవేశాలు కల్పిస్తారు.

**దరఖాస్తు...ఎంపిక విధానం**

యాప్ ద్వార దరఖాస్తు చేసుకోవచ్చు ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఉన్నతాధికారులు పరిశీలించి.. ఎంపిక చేసిన విద్యార్థులను నేరుగా ఆయా కేంద్రీయ విద్యాలయాలకు పంపిస్తారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీలకు 27 శాతం, దివ్యాంగులకు మూడు శాతం సీట్లు కేవీల్లో అందుబాటులో ఉంటాయి.

## ఔరా.. అలేఖ్య..!

సంప్రదాయ ఆటలు ఆడడం కాదు.. వైవిధ్యమైన క్రీడలు ఎంచుకుని కఠోర శ్రమతో సత్తా చాటుతోంది.. జిల్లా నుంచి జాతీయ స్థాయిలో పతకాలు పండిస్తూ గేమ్ ఛేంజర్‌గా ముద్ర వేసుకుంది ఆలేఖ్య. చివ్వెంల మండలం వీకేపహాడ్ గ్రామానికి చెందిన మొండికత్తి అనిల్‌కుమార్, ఉమ దంపతుల కూతురు అలేఖ్య. తండ్రి కారుడ్రైవర్‌గా, తల్లి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. పేద కుంటుంబం కావడంతో అలేఖ్యను ఇమాంపేట గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేర్పించారు. ఓ వైపు చదువులో రాణిస్తూనే ఎనిమిదో తరగతిలో ఉన్నపుడే షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో క్రీడా సాధన ప్రారంభించింది. ప్రిన్సిపల్, పీఈటీల చొరవతో తనకిష్టమైన హ్యాండ్‌బాల్ క్రీడలో శిక్షణ పొంది రాయపర్తి స్పోర్ట్స్ అకాడమీలో చోటు దక్కించుకొంది. అక్కడి కోచ్ మీనా ప్రత్యేక శిక్షణతో పాఠశాల మొదలుకొని రాష్ట్ర, జాతీయస్థాయిలో 12 పతకాలు సాధించి ఔరా అనిపించుకుంటుంది. 'నా విజయంలో బాబాయి కానిస్టేబుల్ యల్లయ్య ప్రోత్సాహం ఎంతో ఉంది. దాతలు, ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తే అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధిస్తానని' అలేఖ్య ఆత్మవిశ్వాసంతో చెబుతోంది.

## ఆగు ఆలోచించు..!

తన పిల్లలు పోటీ ప్రపంచంలో రాణించలేకపోతున్నారని భావోద్వేగానికి లోనైన ఓ తండ్రి ఇద్దరు పిల్లల చేతులకు తాళ్లుకట్టి వారి తలలను నీటి బక్కెట్టులో ముంచి, వారు చనిపోయారని నిర్ధారించుకుని, తానూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ప్రస్తుత సమాజంలో మనుషుల ఆలోచన స్థాయి ఎలా ఉందో చెప్పడానికి ఓ ఉదాహరణ మాత్రమే.: ఒక వ్యక్తి తన భార్య, పిల్లలు, వారి చదువులు, ఇతర బాగోగులు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యత.. ఇలా తన శక్తి, యుక్తులను అన్నీ ఇతరుల కోసమే వినియోగిస్తుంటాడు. ఈ క్రమంలో తీవ్రభావోద్వేగాలకు లోనుకావడం, అనారోగ్యాన్ని కొనితెచ్చుకోవడం వంటివి జరుగుతుంటాయి.కానీ నీకంటూ కొన్ని అభిరుచులు, ఆశలు, ఆశయాలు, ఆలోచనలు ఉంటాయి. మరి వాటి సంగతేంటి... అనేది వెనక్కి తిరిగి చూసుకోవాలి.

**నీ స్థానం తెలుసుకో**

భర్త తన బాధ్యతలు సక్రమంగా నెరవేర్చడం లేదని, పిల్లల గురించి పట్టించుకోవడంలేదని ఓ ఇల్లాలి ఆరోపణ. 'నా బాధ్యతగా ఇంటికి అవసరమైన అన్నింటిని తెస్తున్నాను. డబ్బు ఇస్తున్నాను. ఇంకా నేను చేయాల్సిందేముంది', భర్త నిలదీత. 'పిల్లలు స్కూల్‌కు వెళ్లాక నిద్రలేవడం, రాత్రి పడుకున్నాక ఇంటికి చేరడం, పిల్లలతో ఆయన మాట్లాడక మూడు నెలలైంది' వివరించిన భార్య. ఇందులో పిల్లల మనసులో ఆ ఇంటి యజమాని తండ్రి స్థానం ఎక్కడ, తల్లిదండ్రుల తమ పిల్లలకు సరైన సమయం ఇచ్చి వారితో ప్రేమగా గడపకపోవడం వల్లే ఏమాత్రం ప్రేమానురాగాల ఊసేలేని లోకంలో పెరిగిన పిల్లలు చిన్నచిన్న కారణాలతోనే తల్లిదండ్రులను హత్యచేయడానికి కూడా వెనుకాడని పరిస్థితులు దాపురిస్తున్నాయి.

**నీ సమర్థత నీకు తెలియదా..**

నీవు కుటుంబ పోషణ కోసం చేయాలి కాబట్టి ఏదో ఒక ఉద్యోగమో, వ్యాపారమో చేస్తున్నావు. కానీ అది నీ సమర్థతకు సరిపడినదేనా నీ ఇష్టపూర్వకంగా చేస్తున్నదేనా..ఆలోచించు. నీ సమర్థత నీకు తెలియనిది కాదు. నీ సమర్థతకు తగిన పనిచేయడానికి చిత్తశుద్ధితో ఒక్క ప్రయత్నమైనా చేశావా కాఫీ హెూటళ్ల దగ్గర చేరి ఎందుకూ పనికిరాని, ఎవరూ గుర్తించని రాజకీయాలపై చర్చించడానికి ఎంత సమయం కేటాయిస్తున్నావు చరవాణిని ముందేసుకుని సామాజిక మాధ్యమాల్లో తలదూర్చి ఎంత సమయం కేటాయిస్తున్నావు.. దాని వల్ల ఎంత ప్రయోజనం దక్కుతోంది.. ఆలోచించు

## బంతాట..భలే..!

దేశంలోని క్రీడల్లో క్రికెట్‌కు ఉన్న ఆదరణ అంతాఇంతా కాదు. అంతర్జాతీయ పోటీలో ఇండియా ఆడుతుందంటే చిన్నారులు, యువత టీవీలకు అతుక్కుపోతుంటారు. దీనిని అవకాశంగా తీసుకొని స్నేహితులు, కుటుంబ సభ్యులు సరదాగా..వారాంతాల్లో క్రికెట్ ఆడేందుకు నగరాల్లో 'బాక్స్ క్రికెట్' మైదానాలు ఏర్పాటవుతున్నాయి. ఏడాది క్రితం వరకు నగరాలకే పరిమితమైన ఈ బాక్స్ క్రికెట్ వ్యవస్థ ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో సైతం విస్తరిస్తుంది.

**ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో..**

మిర్యాలగూడ, నల్గొండ, సూర్యాపేట, కోదాడ తదితర పట్టణాల్లో బాక్స్ క్రికెట్ సంస్కృతి పెరుగుతోంది. మిర్యాలగూడలో అంతర్జాతీయ స్థాయిలో ఆకుపచ్చని క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేసిన క్లియో స్పోర్ట్స్ ఎరీనా ఆధ్వర్యంలో బాక్స్ క్రికెట్ మైదానాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఇదే స్ఫూర్తితో ఇటీవలే నాగార్జుననగర్, అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిలో సైతం మరో రెండు బాక్స్ క్రికెట్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో ఫ్లడ్ లైట్లు సైతం ఏర్పాటు చేశారు.

**కుటుంబ సమేతంగా..**

ఈ బాక్స్ క్రికెట్‌ను నిర్వాహకులు గంటల చొప్పున అద్దెకు ఇస్తున్నారు. వారాంతాలు, రాత్రి వేళల్లో వివిధ పనులు చేసేవారు, ఉద్యోగులు, డాక్టర్లు, ఉపాధ్యాయులతో పాటు కుటుంబ సభ్యులందరూ కలిసి అద్దెకు తీసుకుంటున్నారు. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో తమ వారితో కలిసి క్రికెట్ ఆడుతూ..ఉల్లాసంగా గడుపుతున్నారు.

## కన్నవారిపై మానవత్వం లేదా:

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను వారి సంతానం పోషించాల్సిందేనని చౌటుప్పల్ ఆర్డీవో వెల్మ శేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. తల్లిదండ్రుల, వయోవృద్ధుల సంరక్షణ చట్టం ట్రైబ్యునల్ డివిజన్ ఛైర్మన్ హెూదాలో ఆయన స్థానిక రాజస్వ మండలాధికారి కార్యాలయంలో వృద్ధుల పోషణపై అందిన ఫిర్యాదులపై శనివారం విచారణ నిర్వహించారు. వృద్ధులు తమ పోషణ సమస్యపై న్యాయం చేయాలని ఆర్డీవోకు సమర్పించిన ఆరు ఫిర్యాదులపై వారి సంతానానికి నోటీసులు జారీచేసి ట్రైబ్యునల్‌కు రప్పించి విచారణ నిర్వహించారు.

తల్లిదండ్రులను కన్న కుమారులు, కుమార్తెలు పోషించకపోతే, కనీస అవసరాలు తీర్చకపోతే మానవత్వం అనిపించుకుంటుందా.. అని ప్రశ్నించారు. వయోవృద్ధులకు తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం-2007 అండగా ఉంటుందన్నారు. అరవై ఏళ్లు పైబడిన వృద్ధులను వారి సంతానం పోషించనట్టయితే తమ ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేస్తే వారిని పిలిపించి విచారణ నిర్వహిస్తామని, వారి బాధ్యతను గుర్తు చేసి, ఒప్పిస్తామన్నారు. ఈ తీర్పును అమలు చేయని సంతానంపై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరు ఫిర్యాదులను విచారించారు. వృద్ధుల అభిప్రాయాన్ని తెలుసుకుని సంతానానికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

## బడులకు సప్తాహ్ నిధులు

పర్యావరణ పరిరక్షణ, జల వనరుల సంరక్షణపై ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు రాష్ట్రీయ సప్తాహ్ ఆవిష్కార్(రాస్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇలాంటివి నిర్వహిస్తున్నారు. ఇందుకు బడులకు రూ.4 వేల చొప్పున నిధులు విడుదలయ్యాయి. పచ్చదనాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బడుల్లో మొక్కలు నాటడంతోపాటు నీటి సంరక్షణ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలపై రాస్ క్రింద అవగాహన కల్పిస్తారు. ఇంకుడు గుంతల ప్రాధాన్యతలను వివరిస్తారు.

**174 పాఠశాలల ఎంపిక**

రాష్ట్రీయ ఆవిష్కార్ సప్తాహ్ కార్యక్రమాలకు ఉమ్మడి జిల్లాలోని 58 మండలాల్లో 174 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలకు రూ.4 వేల చొప్పున మొత్తం రూ.6.96 లక్షలు విడుదలయ్యాయి. ఈ నిధులు మంజూరైన పాఠశాలల ఉపాధ్యాయులతో జిల్లాల సైన్స్ అధికారులు జూమ్ సమావేశాలను ఇటీవల నిర్వహించారు. చేపట్టిన కార్యక్రమాల వివరాలు, ఫొటోలను ఉన్నతాధికారులకు పంపించే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు.

# అనుబంధాలవైపు.. అడుగులు

నడక చక్కటి, సహజమైన వ్యాయామం. ఎప్పుడైనా, ఎక్కడైనా చేసే వీలైన, తేలికైన వ్యాయామం. అనారోగ్యాలు దరిచేరకుండా ఆరోగ్య జీవనం కొనసాగించేందుకు నడక ఎంతో మేలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం నల్గొండ పట్టణవాసులు నడకపై ఆసక్తి పెంచుకుంటున్నారు. స్థానిక నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిరంతరం వందలాది మంది వాకింగ్ చేస్తూ సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేసుకుంటున్నారు. యువకులు, మహిళలు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల వారు ఉదయం, సాయత్రం వేళల్లో నడక సాధన చేస్తున్నారు. పట్టణ వాసులు ఇక్కడ వాకింగ్ చేసుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ సైతం ఏర్పాటు చేశారు.

**సరదాగా మిత్రులతో..**

ఎన్జీ కళాశాలకు వాకింగ్ వచ్చే వారు నడక సాధన అనంతరం తమ మిత్రులతో బృందాలుగా ఒక చేరి కబుర్లు చెప్పుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు. ఇక్కడ ప్రత్యేకంగా వాకింగ్ అసోసియేషన్ సైతం ఉంది. దీని ఆధ్వర్యంలో ఆయా సమయాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటారు. వాకింగ్ ట్రాక్‌పై శ్రమదాన పనులు చేపడుతుంటారు.

**ఆహార పానీయాలు విక్రయం**

వాకింగ్‌కు వచ్చే వారిని దృష్టిలో పలువురు మైదానం బయట ఆహారపానీయాల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. చద్దన్నం, పండ్లు, కూరగాయల జ్యూస్‌లు, తదితర వాటిని విక్రయిస్తున్నారు. వీటిని తీసుకునేందుకు వాకర్స్ సైతం ఆసక్తి చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మైదానం బయట, లోపల పూర్తి సందడి నెలకొంటుంది.

# హైదరాబాద్ నుంచి యాపిల్ ఎయిర్‌పాడ్స్ ఎగుమతి



దిల్లీ: అమెరికా సంస్థ యాపిల్, హైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ ప్లాంటులో ఎయిర్‌పాడ్స్ తయారు చేయించి, ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఏప్రిల్‌లో వీటి ఎగుమతులు ప్రారంభించాలన్నది కంపెనీ ప్రణాళికగా విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఐఫోన్ల తరవాత, యాపిల్ భారత్‌లో తయారు చేయిస్తున్న రెండో ఉత్పత్తి ఎయిర్‌పాడ్స్ మాత్రమే. హైదరాబాద్ ప్లాంటులో తయారు చేసేవాటిని తొలుత ఎగుమతుల కోసమే కేటాయించనున్నారు. 2023 ఆగస్టులో ప్లాంటు ఏర్పాటు కోసం ఫాక్స్‌కాన్ సంస్థ 400 మిలియన్ డాలర్లు (సుమారు రూ.3,500 కోట్లు) కేటాయించిన సంగతి విదితమే.అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అవుతున్న ఎయిర్‌పాడ్స్ లాంటి పరికరాలపై 20% కస్టమ్స్ సుంకం పడుతోంది. ఇదే తరహా పరికరాలు భారత్‌లో తయారై, తమ దేశంలోకి దిగుమతి అయినా అమెరికా ఇప్పటివరకు సుంకం ఏమీ వసూలు చేయడం లేదు. ఈ నేపథ్యంలోనే 'భారత్ ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలు విధిస్తామని' అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఫలితంగా యాపిల్ సంస్థ భారత్‌లో తయారీని తగ్గించొచ్చనే అంచనాలు వెలువడ్డాయి. రాబోయే నాలుగేళ్లలో అమెరికాలో తయారీ పెంచేందుకు 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని యాపిల్ ప్రకటించిన సంగతి విదితమే. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్ ప్లాంటులో ఎయిర్‌పాడ్స్ తయారీకి యాపిల్ ముందుకు రావడం విశేషం. అమెరికాలో తయారై మనదేశంలోకి దిగుమతి అవుతున్న స్మార్ట్‌ఫోన్లు, వేరబుల్స్, ఎయిర్‌పాడ్స్ లాంటి వాటిపై సుంకాలు పూర్తిగా తొలగించినా, మన పరిశ్రమపై ప్రభావం పడదని, ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి సూచించింది కూడా.

# అమాంతం పెరిగి.. తగ్గిన బంగారం: నేటి ధరలు ఇవే..



హెూలీ రోజు భారీగా పెరిగిన గోల్డ్ రేటు.. ఈ రోజు (మార్చి 15) స్వల్పంగా తగ్గించి. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా పసిడి ధరలలో మార్పులు జరిగాయి. ఈ కథనంలో ఏ ప్రాంతంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయనే వివరాలను తెలుసుకుందాం. హైదరాబాద్, విజయవాడలలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 82,200 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 89,670 వద్ద నిలిచాయి. నిన్న రూ.1,100, రూ.12,00 పెరిగిన గోల్డ్ రేటు.. ఈ రోజు మళ్ళీ రూ. 100 (22 క్యారెట్స్ 10గ్రా), రూ.110 (24 క్యారెట్స్ 10గ్రా) తగ్గింది. ఇదే ధరలు గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో కూడా కొనసాగుతాయి.చైన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ. 100, రూ. 100 తగ్గింది. దీంతో ఇక్కడ 10గ్రా 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 82,200 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 89,670 వద్ద ఉంది.దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు రూ. 82,350 (10గ్రా 22 క్యారెట్స్), రూ. 89,820 (10గ్రా 24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 100, రూ. 110 తక్కువ. అంతే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఢిల్లీలో గోల్డ్ రేటు ఎక్కువగానే ఉంది.

**వెండి ధరలు**

బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు జీవితకాల గరిష్టాలను తాకుతున్నాయి. ఈ రోజు (మార్చి 15) కేజీ సిల్వర్ రేటు రూ. 1,12,000 చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకేవిధంగా ఉన్నప్పటికీ.. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి రేటు రూ. 10,3000 వద్దకు చేరింది.

# ఈ ఏడాదీ ఇళ్లకు బలమైన గిరాకీ



ఈ ఏడాది ఇళ్లు/ఫ్లాట్లకు గిరాకీ బలంగా ఉండబోతోందని స్థిరాస్తి డెవలపర్ల సంఘం క్రెడాయ్ అధ్యక్షుడు బొమన్ ఇరానీ వెల్లడించారు. 2025-26 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను ప్రోత్సాహకాలు ప్రకటించడం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల రెపోరేటును తగ్గించడం.. స్థిరాస్తి రంగానికి కలిసి రావొచ్చని అంచనా వేశారు. దేశీయ గృహ విపణిలో గిరాకీ మందగిస్తున్న సంకేతాలు లేవని పేర్కొన్నారు. స్వల్ప కాలంలో ఎదురయ్యే ఒడుదొడుకులను పరిగణనలోకి తీసుకోనవసరం లేదని, దీర్ఘకాల దృక్పథంతో ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ముంబయి మున్సిపల్ రీజియన్‌లో గత నెలలో 12,000 నివాసాల రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపారు.ద్రవ్యోల్బణాన్ని మించి ఇళ్ల ధరలు పెరుగుతాయ్: మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెడుతున్నందున, గృహ, కార్యాలయ, మాల్స్, గిడ్డంగుల వంటి అన్ని విభాగాల్లో కొత్త వ్యాపారావకాశాలు లభిస్తాయని ఇరానీ పేర్కొన్నారు. ఇళ్ల సరఫరాలు తగ్గిన నేపథ్యంలో, వీటి ధరలు ద్రవ్యోల్బణాన్ని మించి పెరుగుతాయని అంచనా వేశారు. ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసే స్థిరాస్తి డెవలర్లకు మంచి లాభాలు వస్తాయని వివరించారు. క్రెడాయ్ 25వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 1,000 ప్రభుత్వ పాఠశాలలను నవీకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు

## పారిశ్రామిక కేంద్రం... కరవైన ఆహ్లాదం

పరిశ్రమల కేంద్రంగా పేరుపొందిన రామగుండం ప్రాంతంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. వివిధ పరిశ్రమల ఉద్యోగుల కాలనీల్లో ఆయా యజమాన్యాలు అత్యాధునిక ఉద్యానవనాలు, కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. కానీ నగరంలోని ఇతర ప్రాంతాల్లో మాత్రం ఆహ్లాదం మచ్చుకు కనబడటం లేదు. వివిధ కాలనీల్లో ఉద్యానవనాలు ఏర్పాటు చేసిన అధికారులు నిర్వహణను గాలికొదిలేశారు. కొన్నింటిని ప్రహరీలకే పరిమితం చేశారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను ఆధునికీకరిస్తూ మినీ ట్యాంకుబండ్లుగా రూపుదిద్దిన ప్రభుత్వం.. రామగుండం ప్రాంతంలోని ఏకైక చెరువు అభివృద్ధిని అర్ధాంతరంగా వదిలేసింది. బహుళ ప్రయోజనకర భవన నిర్మాణం కోసం నగరంలోని మొదటి సీనియర్ సిటీజన్ పార్కును తొలగించగా.. భవనాన్ని అసంపూర్తిగానే నిలిపివేశారు. నిధులు తగ్గించారు... నిర్మాణం మరిచారుమిషన్ కాకతీయ-2లో భాగంగా చిన్న నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.1.92 కోట్ల అంచనాతో గోదావరిఖనిలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న మల్కాపూర్ చెరువుపై మినీ ట్యాంకుబండ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వివిధ కారణాలతో నిధులను రూ.1.01 కోట్లకు కుదించి టెండర్లు నిర్వహించి గుత్తేదారుకు పనులు అప్పగించారు. 2017 ఫిబ్రవరి 4న పనులకు శంకుస్థాపన చేయగా చెరువు తూము, ఓ వైపు కట్ట మరమ్మతులు, బతుకమ్మ ఘాట్, పూడిక తీత పనులు పూర్తిచేశారు. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కట్టకు ఇరువైపులా తుమ్మలు పెరిగాయి. చీకటి పడిందంటే చాలు మందుబాబులకు అడ్డాగా మారుతోంది.చెరువు మత్తడి నుంచి మొదలకొని కట్టపై మీదుగా శిఖం పక్కనుంచి తిరిగి మత్తడి వరకు చుట్టూ వాకింగ్, సైక్లింగ్ కోసం ప్రత్యేకంగా ట్రాక్, గ్రిల్స్‌తో పాటు కంకర రోడ్డు నిర్మించాల్సి ఉంది. కానీ కేవలం ఒక వైపు మాత్రమే కట్టపై మట్టి పనులు పూర్తిచేశారు. మరో వైపు కనీసం రహదారి పనులు కూడా మొదలుకాలేదు. చెరువును మినీ ట్యాంకుబండ్‌గా తీర్చిదిద్దాలంటే సుమారుగా మరో రూ.2.5 కోట్లు అవసరం అనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. సిద్దిపేట కోమటి చెరువు, పెద్దపల్లి చెరువు తరహాలో మల్కాపూర్ చెరువును అభివృద్ధి చేసేలా పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజల కష్టాలు మొదలాయె..!

భువనగిరి పట్టణ ప్రజలు తాగునీటి కొరత ఎదుర్కొంటున్నారు. 35 వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అత్యధిక ప్రాంతాల్లో కృష్ణా నీటి పైప్‌లైన్లు ఉన్నప్పటికీ శివారు వార్డులు, ఎత్తయిన ప్రాంతాల్లో నల్లా పైప్‌లైన్ లేదు. మరి కొన్ని ప్రాంతాల్లో కృష్ణ పైప్‌లైన్‌తో పాటు స్థానిక బోరు పైప్‌లైన్‌తో నీటి సరఫరా జరుగుతోంది. పది రోజులుగా ఆవాస ప్రాంతాలకు గతంలో నిర్ణయించిన సమయాల్లో సరఫరా జరగడం లేదు. నీరు వదిలే సమయం కుదించడంతో సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. 8వ వార్డులో ట్యాంకర్‌తో నీటి సరఫరా

**నీటి ఇబ్బందులు ఇలా...**

అర్బన్ కాలనీ ఫేజ్-2లో రెండు బోర్లతో సుమారు 280 ఇళ్లకు నీటి సరఫరా జరగాలి. గత కొద్ది రోజులుగా ప్రజల డిమాండ్ మేరకు సరఫరా జరగడం లేదు. 18, 19, 35 వార్డుల్లోని కొన్ని ఎత్తయిన ప్రాంతాల్లో నేటికి స్థానిక బోర్లతో అవసరాలు తీర్చుతున్నారు.

అర్బన్ కాలనీ, తారకరామానగర్, బంజారాహిల్స్, న్యూరాంనగర్, సింగన్నగూడెం, సీతానగర్, ఇందిరమ్మ కాలనీ, మాటూరి బస్తీ, ఎరుకల బస్తీల్లో సమస్య ఉంది.ఇళ్లలో బోర్లు ఉన్న వారు బోరు నీటితో తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. నల్లా నీటిపై ఆధారపడిన వారు ట్యాంకర్ కొనుగోలు చేస్తున్నారు.ఈ విషయమై డీఈ కొండల్‌రావును వివరణ కోరగా.. పట్టణానికి నీటి సరఫరా జరిగే పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా నీటి సరఫరా వేళల్లో స్వల్ప మార్పులు జరిగాయి.. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు.

## రోబో క్యూబ్: గెలుస్తుంది.. గెలిపిస్తుంది..

రూబిక్స్ క్యూబ్ పజిల్‌ను పరిష్కరించడానికి చాలా కష్టపడుతుంటారు కొంతమంది. ఇప్పుడు సులువుగా పరిష్కరించే పద్ధతిని నేర్పిస్తుంది ఈ 'ఎక్స్ మ్యాక్ రోబో క్యూబ్' చూడటానికి సాధారణ రూబిక్స్ క్యూబ్‌లాగే ఉంటుంది కాని, ఇందులోని ఆరు మోటార్లు రూబిక్స్ క్యూబ్‌లోని బ్లాక్స్‌ను సులువుగా తిప్పుతూ స్వయంగా పరిష్కరిస్తుంది.ఎవరైనా పజిల్‌ను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో వివిధ రంగుల లైట్లు, సంగీతాలను ప్లే చేస్తూ అర్థమైయ్యేలా మార్గనిర్దేశం చేస్తుంది. ఇలా దీని సాయంతో చిన్న పిల్లలు కూడా రూబిక్స్ క్యూబ్‌ను సులువుగా పరిష్కరించగలరు. ధర కాస్త ఎక్కువ. ఆన్‌లైన్‌లో దొరుకుతుంది

## ఈత నేర్పే షార్క్..!

ఫొటోలో కనిపిస్తున్న ఈ షార్క్ బొమ్మ పిల్లలకు ఈత నేర్పుతుంది. అది కూడా చాలా సులువుగా. ఈ స్విమ్మింగ్ కిక్‌బోర్డులోని మోటార్స్‌ను పిల్లలు ఈత నేర్చుకునేలా డిజైన్ చేశారు. కేవలం దీని హ్యాండిల్స్‌ను కంట్రోల్ చేస్తూ ఎంత దూరమైన ఈత కొడుతూ వెళ్లొచ్చు.ఇందులోని స్పీడ్ కంట్రోల్ ఆప్షన్‌తో వేగాన్ని నియంత్రించుకోవచ్చు. బ్యాటరీ సాయంతో పనిచేస్తుంది. పిల్లల వయసు బట్టి ఈ డివైజ్ సైజు ఉంటుంది. వాటిని బట్టే ధర. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వీలుంది.ఫొటోలో కనిపిస్తున్న ఈ షార్క్ బొమ్మ పిల్లలకు ఈత నేర్పుతుంది. అది కూడా చాలా సులువుగా. ఈ స్విమ్మింగ్ కిక్‌బోర్డులోని మోటార్స్‌ను పిల్లలు ఈత నేర్చుకునేలా డిజైన్ చేశారు. కేవలం దీని హ్యాండిల్స్‌ను కంట్రోల్ చేస్తూ ఎంత దూరమైన ఈత కొడుతూ వెళ్లొచ్చు.



# ఆ ఇద్దరు నిర్మాతలకు హ్యాండించిన సన్నిడియోల్

బాలీవుడ్‌లో ఏ హీరో కు ఎప్పుడు టైమ్ వస్తుందో చెప్పడం కష్టం. అగ్ర కథానాయకులుగా రాణించిన వారు... ఒక్కసారిగా తెర మాటుకు వెళ్ళిపోతుంటారు. 'ఇక ఈ హీరో పని అయిపోయింది' అనుకున్న సమయంలో సీనియర్ హీరోలు ఊహించని విజయంతో తెర మీదకు వస్తున్నారు. ప్రస్తుతం సన్నీ డియోల్ పరిస్థితి ఇదే. సన్నీ డియోల్ కు ఇక విజయం దక్కడం కష్టమని అంతా అనుకుంటున్న టైమ్ లో 'గదర్ -2' సినిమాతో అమాంతంగా రూ. 500 కోట్ల క్లబ్ లో చేరి 'సన్నీ ఈజ్ బ్యాక్' అనిపించుకున్నాడు. అయితే 'గదర్ -2' సక్సెస్ తర్వాత సన్నీ డియోల్ ప్రాధాన్యతలు మారిపోయాంటూ కొందరు వాపోతున్నారు. 'గదర్ -2' చిత్రానికి ముందు సన్నీ కొన్ని సినిమాలు అంగీకరించాడు. అందులో ఒకటి 'సూర్య'. ఇది మలయాళ చిత్రం 'జోసఫ్'కు రీమేక్. కమల్ ముకుత్ నిర్మిస్తున్న ఈ సినిమా దాదాపు ఎనభై శాతం షూటింగ్ అయిపోయింది. కానీ నిర్మాణపరంగా జరిగిన జాప్యంతో ఈ మూవీ వెనక్కి వెళ్ళిపోయి 'గదర్ -2' ముందు కొచ్చింది. 'గదర్ -2' తర్వాత 'సూర్య' ను పూర్తి చేస్తానని సన్నీ చాలా సార్లు చెప్పారు. కారణాలు ఏవైనా... అది మాత్రం జరగలేదు. విశేషం ఏమంటే మలయాళ చిత్రం 'జోసఫ్' ను తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ రీమేక్ చేశారు. తెలుగులో దీనిని 'శేఖర్' పేరుతో రాజశేఖర్ రీమేక్ చేయగా, జీవిత డైరెక్ట్ చేసింది. బట్.. మూవీ ఇక్కడ పరాజయం పాలైంది. సన్నీ డియోల్ పక్కన పెట్టిన మరో ప్రాజెక్ట్ 'బాప్'. ఈ సినిమా కూడా 'గదర్ -2' కంటే ముందుదే! సహజంగా ఏ హీరో నటించిన సినిమా అయినా విడుదలై ఘన విజయం సాధించగానే అతను నటించిన చిత్రాలు పాతవి ఆగిపోయి ఉంటే... ఓ ఊపులో అవీ జనం ముందుకు వచ్చేస్తుంటాయి. కానీ సన్నీ డియోల్ విషయంలో మాత్రం అలా జరగడం లేదు. 'బాప్' సినిమాలో సన్నీ తో పాటు సంజయ్ దత్, జాకీ ష్రాఫ్, మిథున్ చక్రవర్తి కీలక పాత్రలు పోషించారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయిపోయిందని, ఈ సీనియర్ స్టార్స్ కాంబోలో కొన్ని సన్నివేశాలు మాత్రమే చిత్రీకరించాల్సి ఉందని దర్శకుడు అహ్మద్ ఖాన్ చెబుతున్నాడు. కానీ సన్నీ డేట్స్ కేటాయించక పోవడం వల్లే జాప్యం జరుగుతోందని ఆయన వాపోతున్నాడు.

# ఆమెలో నాకు అదే నచ్చింది

## కొత్త గర్ల్‌ఫ్రెండ్ గురించి చెప్పిన అమీర్‌ఖాన్





బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ ఆమీర్ ఖాన్. సినిమాలతో పాటు తన వ్యక్తిగత జీవితంతోనూ నిత్యం వార్తల్లో నిలుస్తోన్న ఆయన ఇప్పుడు మరోసారి నెట్టింట ట్రెండ్ అవుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు పెళ్లి చేసుకుని, తన ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చేసిన ఆమిర్ ఖాన్ జీవితంలోకి మళ్లీ కొత్త ప్రేమ ప్రవేశించిందని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఆమీర్ ఖాన్ ఓ యువతితో డేటింగ్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తుంది. ఆమె పేరు గౌరి. ఆమీర్ ఖాన్ రీసెంట్ గా తన 60వ పుట్టినరోజు సందర్భంగా కొత్త స్నేహితురాలిని పరిచయం చేశాడు. ఇప్పుడు గౌరి ఆమిర్ ఖాన్ లో తనకు నచ్చిన విషయాన్ని వెల్లడించింది. ఈకామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ముందుగా ఆమీర్ ఖాన్ మాట్లాడుతూ.. గౌరీలో తనకు నచ్చిన విషయాన్ని వెల్లడించాడు. 'నన్ను ప్రశాంతంగా ఉంచే, నాకు పీస్ ను ఇచ్చే భాగస్వామి కోసం నేను వెతుకుతున్నాను.' గౌరికి ఆ లక్షణాలు ఉన్నాయి అనిఆమీర్ ఖాన్ అన్నారు. అలాగే గౌరీ మాట్లాడుతూ.. 'నాకు మంచి వాడు, సౌమ్యుడైన, శ్రద్ధగల వ్యక్తి అవసరం.' "అప్పుడు నేను ఆమీర్ ఖాన్ ను కలిశాను" అని గౌరి తెలిపింది. ఆమీర్ ఖాన్ , గౌరీ 25 సంవత్సరాలుగా ఒకరికొకరు తెలుసు. 25 సంవత్సరాలుగా తెలిసినప్పటికీ ఇద్దరి మధ్య అంతగా మాటలు ఉండేవి కాదు. "మేము ఒకటిన్నర సంవత్సరం క్రితం మళ్ళీ పరిచయమయ్యాము" అని ఆమీర్ ఖాన్ అన్నారు. గౌరి బెంగళూరులో పెరిగింది. అతను సౌత్ సినిమాల అభిమాని. ఆమె పెద్దగా హిందీ సినిమాలు చూడలేదు. గౌరీ ఏడాది క్రితం ఆమీర్ నటించిన 'దిల్ చాహ్తే హై', 'లగాన్' సినిమాలు చూసిందట. ఇక ఆమీర్ ఖాన్ మార్చి 14, 1965న జన్మించాడు. అదేవిధంగా, గౌరి ఆగస్టు 21, 1978న జన్మించింది. ఇద్దరి మధ్య దాదాపు 14 సంవత్సరాలగ్యాప్ ఉంది. ఈ విషయం గురించి బాలీవుడ్ లో చాలా చర్చ జరుగుతోంది.

# తమన్నా బాయ్‌ఫ్రెండ్‌కు అరుదైన వ్యాధి



సీనియర్ నటి తమన్నా భాటియా, బాలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ వర్మ వివాహం చేసుకుంటారని అభిమానులు ఆశగా ఎదురు చూశారు. కానీ ఇప్పుడు షాకింగ్ న్యూస్ ఒకటి వినిపిస్తోంది. చాలా కాలంగా డేటింగ్ లో ఉన్న విజయ్ వర్మ, తమన్నా భాటియా ఇప్పుడు విడిపోయారని వార్తలు పుట్టుకొచ్చాయి. అయితే ఈ వార్తల్లో వాస్తవం లేదని తెలుస్తుంది. మిల్కీ బ్యూటీ తమన్నా ఒకానొక సమయంలో టాలీవుడ్‌ను ఏలింది. వరుసగా సినిమాలు చేసి మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అమ్మడు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. తమన్నా ప్రస్తుతం తెలుగులో సినిమాలు తగ్గించింది. హిందీ మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది ఈ చిన్నది. తెలుగులో చివరిగా చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో చేసింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఇదిలా ఉంటే తమన్నా త్వరలోనే పెళ్లి పీటలెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తమన్నా విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. విజయ్ వర్మ ఎవరో కాదు. బాలీవుడ్ నటుడు.. అలాగే నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన ఎమ్‌సీఏ సినిమాలో విలన్ గా నటించాడు. అయితే చాలా కాలంగా ప్రేమలో మునిగి తేలుతున్నారు. అయితే ఈ ఇద్దరూ ఈ మధ్య విడిపోయారు అంటూ వార్తలు వచ్చాయి. తమన్నా, విజయ్ వర్మ బ్రేకప్ చేసుకున్నారని రూమర్స్ వినిపించాయి. వాటిలో నిజం లేదు అని అంటున్నారు. ఇదిలా ఉంటే విజయ్ వర్మ ఓ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని తెలుస్తుంది. విజయ్ వర్మ తనకు విటిలిగో అంటే బొల్లి వ్యాధి ఉందని బహిరంగంగానే తెలిపారు. ఈ వ్యాధి కారణంగా తన చర్మం పై తెల్లటి మచ్చలు ఉంటాయని వివరించారు. అలాగే దాని కారణంగా తన లైఫ్ లో అశాంతి నిండిపోయింది అని తెలిపారు. ఇదిలా ఉంటే తమన్నా విజయ్ కలిసి ఓ వెబ్ సిరీస్ లోనూ నటించారు. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని తెలుస్తుంది. రీసెంట్ గానే ఈ ఇద్దరూ కలిసి హోలీ సెలబ్రేషన్ లో పాల్గొన్నారు.

# ఇంగ్లాండ్ సిరీస్‌లో రోహిత్ కెప్టెన్ గా కొనసాగేనా?




ఇటీవల రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీం ఇండియా ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు భారత జట్టు జూన్‌లో మైదానంలోకి అడుగుపెడుతుంది. అది ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడేందుకు ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. కానీ ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే రోహిత్ శర్మ ఈ పర్యటనలో టీం ఇండియా తరఫున ఆడతాడా.. ఆ సమయంలో అతడు కెప్టెన్ గా వ్యవహరిస్తాడా లేదా ? అతని కెప్టెన్సీలో భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది కాబట్టి ఈ ప్రశ్నలన్నీ తలెత్తుతున్నాయి. ఈ పర్యటన సందర్భంగా రోహిత్ టెస్ట్‌ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని కూడా వార్తలు వచ్చాయి. అయితే ఇటీల తన రిటైర్మెంట్ వార్తలను తిరస్కరించారు. ఇప్పుడు అతని కెప్టెన్సీ గురించి కూడా ఒక కీలక అప్ డేట్ వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన తర్వాత రోహిత్ శర్మ కెరీర్‌లో ఒక పెద్ద మలుపు తిరిగింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన ఒక నివేదిక ప్రకారం.. రోహిత్ శర్మ మరో పెద్ద పర్యటనకు జట్టును కెప్టెన్‌గా నియమించడానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి, దాని సెలక్షన్ ప్యానెల్ సపోర్ట్ దక్కించుకున్నాడు. దీని అర్థం ఇంగ్లాండ్ పర్యటనలో రోహిత్ శర్మ కెప్టెన్‌గా కొనసాగే అవకాశం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడం వల్ల రోహిత్ టెస్ట్ కెరీర్ కొనసాగుతుందని అర్థం అవుతుంది. 2024-25 ఆస్ట్రేలియా పర్యటనలో టీం ఇండియా 3-1 తేడాతో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ సమయంలో రోహిత్ ప్రదర్శన పై విమర్శలు వచ్చాయి. రోహిత్ సిరీస్ చివరి మ్యాచ్‌లో ఆడకూడదని నిర్ణయించుకున్నాడు. రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకోవడంతో ఈ సిరీస్ ముగిసిన వెంటనే అతను టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతాడని అభిమానుల్లో పుకార్లు వ్యాపించడం ప్రారంభించాయి. కొంతమంది సీనియర్లు కూడా రోహిత్ టెస్ట్ ఫార్మాట్‌ను విడిచిపెట్టాలని భావించారు. కానీ రోహిత్ తన విమర్శకులకు తగిన సమాధానం ఇస్తూ ఒక పెద్ద ప్రకటన ఇచ్చాడు. సిడ్నీ టెస్ట్ రెండో రోజు లంచ్ సమయంలో స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ రోహిత్ శర్మ మాట్లాడుతూ, 'ఇప్పుడు పరుగులు రావడం లేదు, కానీ 5 నెలల తర్వాత కూడా అవి రావని హామీ లేదు. నేను కష్టపడి పనిచేస్తాను.

# ధోనీ కెప్టెన్సీ అద్భుతం..

## ధోనీది మాస్టర్ మైండ్స్ ● వెంకటేశ్ అయ్యర్ కీలక వ్యాఖ్యలు



ఐపీఎల్లో అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో ఒకరు కోల్ కతా నైట్ రైడర్స్ కి చెందిన వెంకటేశ్ అయ్యర్.. గతేడాది ఐపీఎల్ టైటిల్ సాధించడంలో తను కీలకపాత్ర పోషించాడు. బ్యాట్ తో మెరుపులు మెరిపించడంతోపాటు, బౌలింగ్ లోనూ ఒక చేయి వేయగల సిసలైన ఆల్ రౌండర్ తను. అందుకే రూ.23.75 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించి కేకేఆర్ అతడిని కొనుగోలు చేసింది. రిషభ్ పంత్ (రూ.27 కోట్లు), శ్రేయస్ అయ్యర్ (రూ.26.75 కోట్లు) తర్వాత అత్యంత ఖరీదైన ప్లేయర్ గా తను నిలిచాడు. ప్రజెంట్ కేకేఆర్ కెప్టెన్ గా వెటరన్ అజింక్య రహానేను ప్రకటించినా, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంకటేశ్ ను వైస్ కెప్టెన్ గా నియమించారు. ఇక గతంలో కెప్టెన్సీకి సంబంధించి చెన్నై సూపర్ కింగ్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ఎధోనీ నుంచి 2023లో తను నేర్చుకున్న విషయాన్ని వెంకటేశ్ పంచుకున్నాడు. చెన్నైతో మ్యాచ్ ఆడుతున్నప్పుడు ఒక ఫీల్డర్ స్థానాన్ని మార్చి తనను ఔట్ చేసినట్లు వెంకటేశ్ తెలిపాడు. నిజానికి ఆ మ్యాచ్ లో 4 బంతుల్లో 9 పరుగులు చేసిన తను.. దీపక్ చాహర్ బౌలింగ్ తో తర్వాతి బంతి కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపాడు. అయితే ఇంతలో డీప్ స్క్వేర్ లెగ్ లో ఉన్న ప్లేయర్ ను మార్చి, అతడి స్థానాని షార్ట్ థర్డ్ మ్యాన్ దిశగా పెట్టాడని పేర్కొన్నాడు. అది కూడా కొంచెం ఎడంగా పెట్టినట్లు గుర్తు చేసుకున్నాడు. అయితే ఆ తర్వాతి బంతికే తను నేరుగా ఆ ఫీల్డర్ చేతిలోకి బంతిని కొట్టి ఔటైనట్లు పేర్కొన్నాడు. మ్యాచ్ తర్వాత ధోనీతో ఈ విషయంపై సంప్రదింపులు జరిపానని, ధోనీ చెప్పిన విషయం విని తను షాక్ కు గురైనట్లు తెలిపాడు. అప్పటికే తన బ్యాటింగ్ పై ఒక అంచనాకు వచ్చిన ఎంఎస్ ధోనీ.. ఫీల్డింగ్ లో మార్పులు చేసినట్లు మ్యాచ్ ముగిసిన అనంతరం తనతో చెప్పినట్లు వెంకటేశ్ పేర్కొన్నాడు. తను బంతిని కొడుతున్న విధానం, యాంగిల్ ను చూసి, ఫీల్డర్ ను అక్కడ మోహరించినట్లు వెల్లడించాడు. అప్పటికే ఈ విషయాన్ని పదే పదే రీప్లేలో కెమెరాల్లో ప్రసారం అవుతుందని గుర్తు చేసుకున్నాడు. మొత్తానికి బ్యాటర్ల బలానికి అనుగుణంగా ఫీల్డర్లను పెట్టి, ధోనీ పై చేయి సాధించినట్లు వెంకటేశ్ పేర్కొన్నాడు. ఇక ఐపీఎల్ ఈనెల 22 నుంచి ప్రారంభం అవుతుండగా, తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ చాంపియన్ గా కేకేఆర్ బరిలోకి దిగుతోంది. ఈడెన్ గార్డెన్స్ లో జరిగే ఈ మ్యాచ్ లో మూడుసార్లు ఫైనలిస్టు.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. తర్వాతి రోజు హైదరాబాద్ కు చెందిన ఫ్రాంచైజీ సన్ రైజర్స్ హైదరాబాద్ బరిలోకి దిగనుంది. ఉప్పల్ మైదానంలో జరిగే ఈ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ తో సన్ రైజర్స్ తలపడనున్నారు. అలాగే అదే రోజు చెన్నై తో ముంబై ఇండియన్స్ అమీతుమీ తేల్చు కోనుంది.




# సూర్యకుమార్‌కు ముంబయి జట్టు పగ్గాలు?

## పాండ్య, బుమ్రా గైర్హాజరీతో నిర్ణయం

2025 ఐపీఎల్?కు రంగం సిద్ధమైంది. మరో వారం రోజుల్లో టోర్నమెంట్? ప్రారంభం కానుంది. మార్చి 22న కోల్?కతా- ఆర్సీబీ మ్యాచ్?తో ఈ ఎడిషన్?కు తెర లేవనుంది. ఈ క్రమంలో ఈసారి ఏయే జట్టుకు ఎవరు కెప్టెన్?గా వ్యవహరించనున్నారో క్లారిటీ వచ్చేసింది. అయితే మోస్ట్? సక్సెస్?ఫుల్ ముంబయి ఇండియన్స్? జట్టు కెప్టెన్సీలో మాత్రం మార్పు జరిగే ఛాన్స్ ఉంది! ఎందుకంటే? ఈ ఎడిషన్?లో ముంబయి మార్చి 23న చెన్నై సూపర్ కింగ్స్?తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్?కు చెన్నై చెపాక్ స్టేడియం వేదిక కానుంది. అయితే ఈ మ్యాచ్?లో ముంబయి జట్టుకు రెగ్యులర్ సారథి హార్దిక్ పాండ్య కాకుండా స్టార్ ప్లేయర్? సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్?గా వ్యవహరించే ఛాన్స్ ఉంది. ఆ మ్యాచ్?కు పాండ్య దూరం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024 ఎడిషన్?లో ముంబయి మూడుసార్లు స్లో ఓవర్ రేట్?కు గురైంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం సింగిల్ సీజన్?లో ఓ జట్టు మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు స్లో ఓవర్ రేట్?కు గురైతే, ఆ టీమ్ కెప్టెన్?కు రూ.30 లక్షల జరిమానా, ఒక మ్యాచ్? నిషేధం పడుతుంది. ఈ క్రమంలో గత సీజన్? లీగ్ దశలోనే హార్దిక్ సస్పెన్షన్?కు గురయ్యాడు. అయితే ఆ సీజన్?లో ముంబయి క్వాలిఫైయర్?కు అర్హత సాధించకపోవడం వల్ల, హార్దిక్?పై సస్పెన్షన్ కొనసాగుతూ వచ్చింది. ఇలా ఐపీఎల్? నిబంధనలతో పాండ్యకు షాక్ తగిలినట్టైంది! దీంతో తాజా ఎడిషన్?లో తొలి మ్యాచ్?కు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక వైస్?కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా కూడా గాయం కారణంగా తొలి రౌండ్ మ్యాచ్?లకు దూరం కానున్నాడు. దీంతో పాండ్య, బుమ్రా గైర్హాజరీలో సూర్య కెప్టెన్?గా జట్టును నడిపించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు జట్టులో మోస్ట్ సక్సెస్?ఫుల్ కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నప్పటికీ, అకడు సారథ్యం బాధ్యతలు తీసుకోకపోవచ్చు. అందుకే మేనేజ్?మెంట్? కూడా సూర్యకే తాత్కాలిక బాధ్యతలు అప్పగించే ఛాన్స్ ఉంది. ఇక మిగిలిన సీజన్? మొత్తానికి హార్దిక్ మళ్లీ కెప్టెన్?గా వ్యవహరిస్తాడు.

**ముంబయి జట్టు ఐపీఎల్ 2025 :**
రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, తిలక్ వర్మ, ట్రెంట్ బౌల్ట్, నమన్ ధీర్, రాబిన్ మింజ్, కరణ్ శర్మ, దీపక్ చాహర్, ర్యాన్ రికెల్టన్, విల్ జాక్స్, అశ్వని కుమార్, మిచెల్ సాంట్నర్, రీస్ టోప్లీ, శ్రీజిత్, రాజ్ అంగద్ బావా, బెవాన్ జాకబ్స్, వెంకట పెన్మెట్సా, అర్జున్ తెందూల్కర్, లిజాడ్ విలియమ్స్, విగ్నేష్ పుత్తూరు, ముజీబ్ అర్ రహ్మాన్